Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 255 విశాఖపట్నం, 26 జూలై 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఫ్యాక్షనిజం ఉన్న గ్రామాలపై శ్రద్ధ పెట్టాము: సీఎం

అమరావతి: ఏపీ అసెంబ్లీలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఫ్యాక్షనిజం ఉన్న గ్రామాలపై శ్రద్ధపెట్టామని, టీడీపీ హయాంలోనే నేరాలు కట్టడి చేశామని ఆయన వెల్లడించారు. 2014-19 మధ్య కాలంలో శాంతి భద్రతలకు చర్యలు తీసుకున్నామన్నారు. 2019-2024 మధ్య కాలంలో ప్రభుత్వమే హింసను ప్రేరేపించిందని.. స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించిందని ఆయన విమర్శలు గుప్పించారు. వైసీపీ కక్షపూరిత చర్యలకు పోలీసులు అయుధాలుగా మారారన్నారు. తమ మాట వినని పోలీసులను వెకెన్సీ రిజర్వ్‌కు గత ప్రభుత్వం పంపించిందని.. ఐదేళ్లు వీఆర్‌లో ఉన్న పోలీసు అధికారులూ ఉన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. తన మీద చిన్నప్పటి నుంచి ఒక్క కేసు కూడా లేదని.. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక నాపై 17, పవన్ కళ్యాణ్ మీద 7 కేసులు పెట్టారని చెప్పారు. పవన్ రోడ్ మీద పడుకుని నిరసన తెలియచేసే పరిస్థితి కల్పించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా



బోండా ఉమ, బుద్దా వెంకన్నను అడ్డుకున్నారని.. లోకేష్ పాదయాత్రను అడ్డుకున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు. లోకేష్ పాదయాత్రను అడ్డుకునేందుకు రాజమండ్రిలో వంతెన కూడా మూసేశారని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేస్తుంటే అరెస్ట్ చేశారని.. ధూళిపాళ నరేంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఆదిరెడ్డి అప్పారావు, పత్తిపాటి పుల్లారావు వంటి కుటుంబాలను ఇబ్బంది పెట్టారని.. స్పీకర్ అయ్యన్నపై కేసులు పెట్టారని.. తప్పుడు కేసులు పెట్టి కోడెలను అవమానించారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆ అవమానంతోనే కోడెల ఊరేసుకుని ఆత్మహత్య చేసుకునేలా చేశారని ఆరోపించారు. ప్రస్తుత హెూం మంత్రి అనిత మీద, కొందరు ఎస్సీల మీద కూడా ఎస్సీ అట్రాసిటీ కేసులు పెట్టారని చెప్పారు. అయ్యన్న మీద అత్యాచారం చేయబోయారనే కేసు పెట్టడం సిగ్గు చేటన్నారు. పైల్స్ ఆపరేషన్ చేయించకుని రెస్ట్ తీసుకుంటున్న అచ్చెన్నని 600 కిలో మీటర్లు తిప్పారని మండిపడ్డారు. రఘురామకఅష్ణం రాజును జైల్లో పెట్టి కొడుతుంటే.. ఆనాటి సీఎం ఫోన్లో చూసి ఆనందించారని ఆగ్రహించారు. రఘు రామకృష్ణంరాజును తన సొంత నియోజక వర్గానికి కూడా వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. ప్రధాని తన నియోజకవర్గానికి వచ్చినా రఘురామ వెళ్లలేక పోయారని వాపోయారు. తాను అమరావతి పర్యటనకు వెళ్తే

(మిగతా 2లో)

## విమాన టికెట్ ధరల ఆకస్మిక పెంపుపై ఎంపీల ఫిర్యాదు



ఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ 'ఎయిర్ విస్తారా'లో టికెట్ ధరలు ఆకస్మికంగా పెరుగుతున్నాయంటూ లోక్‌సభలో కొందరు ఎంపీలు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఓం బిర్లా కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు.

లోక్‌సభలో గురువారం ప్రశ్నోత్తరాల గంట సమయంలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఈ సమస్యను లేవనెత్తారు. ఎయిర్ విస్తారాలో చెన్నై నుంచి దిల్లీకి తాను టికెట్ బుక్ చేసుకునేందుకు ధర చూడగా తొలుత రూ.25వేలు చూపించిందని తెలిపారు. బుకింగ్ ప్రాసెస్ పూర్తయ్యాక పేమెంట్ చేసేటప్పుడు మాత్రం ఆ ధర రెండు నుంచి మూడు రెట్లు పెరుగుతుందని అన్నారు.

దీనిపై వెంటనే ఓం బిర్లా స్పందిస్తూ.. ఇతర ఎంపీల నుంచి కూడా తనకు ఇలాంటి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని సభాపతి అభిప్రాయపడ్డారు. దీనికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు బదులిస్తూ.. ఈ అంశంపై దర్యాప్తు చేపడుతామని తెలిపారు.

(మిగతా 2లో)

## జగన్.. అసెంబ్లీకి వచ్చి ఆ పేర్లు చెప్పే దమ్ము లేదా?

**అమరావతి:** రాష్ట్రంలో ఇప్పటికీ తెదేపా కార్యకర్తలపై దాడులు కొనసాగుతున్నాయని ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తూ దిల్లీ వీధుల్లో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్ గుర్తొస్తే ఆయనకు నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు.

"రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని దిల్లీలో జగన్ అబద్ధాలు చెప్పారు. హత్యకు గురైనవారి పేర్లు అడిగితే ఆయన చెప్పలేకపోయారు. అసెంబ్లీకి వచ్చి ఆ పేర్లు చెప్పే దమ్ము జగన్‌కు లేదా?అసెంబ్లీలో అడగకుండా దిల్లీలో మాట్లాడితే ఏం

(మిగతా 2లో)



## కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ ఆగస్టు 8 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని ఆగస్టు 8 వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ గురువారంతో ముగియనున్న నేపథ్యంలో సిబిఐ తీహార్ జైలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచింది. అనంతరం



ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని ఆగస్టు 8 వరకు పొడిగించింది.

కాగా, తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన లాయర్లతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దరఖాస్తు చేశారు. అయితే జులై 1వ తేదీన రౌస్ అవెన్యూ కోర్టు

(మిగతా 2లో)

## తెలుగు రాష్ట్రాల్లో 3 రోజుల పాటు భారీ వర్షాలు

గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, మరి కొన్ని జిల్లాల్లో ముసురు కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.

ప్రాజెక్టులు నిండు కుండగా మారాయి. అయితే ఇప్పట్లో వర్షాలు తగ్గేలా కనిపించటం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 3 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. నేడు ప్రకాశం,నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాల పడే అవకాశం ఉందని వెల్లడించింది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ



మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.లో

**అటు తెలంగాణలో..**

అటు తెలంగాణలో పలు జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరో రెండ్రోజులు పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30- 40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితేనే బయటకు వెళ్లాలని.. చెట్ల కిందకు వెళ్లరాదని అధికారులు సూచించారు.

## మూడోసారి ఓటమిని జీర్ణించుకోలేకే.. కాంగ్రెస్ ఇలా



ఢిల్లీ: నీట్ (యూజీ) వ్యవహారంపై సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం విద్యార్థుల ఓటమి కాదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వరుసగా మూడోసారి ఎన్నికల్లో ఓడిపోవడంతో కాంగ్రెస్ బాధ్యతారాహిత్య వైఖరిని ప్రదర్శిస్తూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పేపర్ లీక్‌లు, అవినీతికి కాంగ్రెస్ పార్టీ తండ్రి లాంటిదని ఆరోపిస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. పరీక్షల పవిత్రతకు సంబంధించి ఎలాంటి వ్యవస్థాగతమైన ఉల్లంఘన జరగలేదని సర్వోన్నత న్యాయస్థానమే స్పష్టంగా చెప్పిందన్నారు. కాంగ్రెస్‌కు కేంద్ర ప్రభుత్వంపై గానీ, సుప్రీం కోర్టుపై గానీ నమ్మకం లేదని మండిపడ్డారు.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో అక్కడ పేపర్ లీక్ అయిన విషయం ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు తెలియదా? అని ప్రధాన్ ప్రశ్నించారు. వారి ప్రభుత్వ హయాంలో లీక్‌లు జరిగితే ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీల నేపథ్యంలో దేశ ప్రజలు వరుసగా మూడోసారి కూడా కాంగ్రెస్‌ను తిరస్కరించారనీ.. అందువల్ల పతనమవుతున్న తన రాజకీయ ప్రాభవాన్ని నిలబెట్టుకొనేందుకే ఇలా అవాస్తవాలు, అర్థ సత్యాలు, అరాచకానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఖర్గేకు గానీ, రాహుల్‌గాంధీకి గానీ విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన లేదని.. వారు తమ, ఒక కుటుంబం భవిష్యత్తు గురించే ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానించారు. ఇకనైనా దేశ పరీక్ష విధానం, దాని ప్రతిష్టను దిగజార్చి విద్యార్థుల భవితతో ఆడుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

## సిటీ ఆపరేషన్స్ సెంటర్ ను సందర్శించిన జీవీఎంసీ కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాల సంస్థ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్ ను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ గురువారం సందర్శించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా ఏ ఏ సేవలు నిర్వహిస్తున్నారని పర్యవేక్షక ఇంజనీర్ వినయ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా నగరంలో 500 సీసీ కెమెరాలు 83 జంక్షన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే 84 పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్స్, 50 స్మార్ట్ పోల్స్, 85 అత్యవసర కాల్ బాక్సులు, 10 వి.ఎమ్.డి బోర్డుల ద్వారా సేవలు కల్పిస్తూ జరుగుతుందని, సిటీ ఆపరేషన్ సెంటర్ ఎల్ & టి, ఫ్లూయింటిగ్రిడ్ నిర్వహణ లో కార్యకలాపాలను 24 గంటలు పర్యవేక్షించడం జరుగుచున్నదని పర్యవేక్షక ఇంజనీర్ కమిషనర్ కు వివరించారు.

అనంతరం కమిషనర్ సిటీ ఆపరేషన్స్ సెంటర్ ఉద్యోగుల వివరాలు, వారి విధుల తోపాటు ప్రతిరోజు ప్రజల నుండి ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి,

(మిగతా 2లో)

## "వైభవంగా జరిగిన పట్టణ అధికార భాషా అమలు కమిటీ- (టౌన్ ఆఫీసిఎల్ లాంగ్వేజ్ ఇంప్లీమెంటేషన్ కమిటీ టాలిక్ - పిఎస్‌యు సమావేశం"



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** హిందీని ప్రచారం చేయడంలో చేసిన కృషికి విశాఖపట్నం లోని వివిధ పిఎస్‌యులకు అవార్డులను అందజేసిన అతుల్ భట్, చైర్మన్, టౌన్ అధికారిక భాషా అమలు కమిటీ-టాలిక్, విశాఖపట్నం మరియు సిఎండి, రిల్ టౌన్ అధికార భాషా అమలు కమిటీ-టాలిక్ (పిఎస్‌యు), విశాఖపట్నం సమావేశం ఈరోజు హెూటల్ నోవాటెల్‌లో ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో జరిగింది.

అతుల్ భట్, చైర్మన్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ-టోలిక్, విశాఖపట్నం & సిఎండి, ఆర్ఐఎన్ఎల్ 2023-24 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన 'రాజభాష గౌరవ్ సమ్మాన్'ను విశాఖపట్నంలో ఉన్న పిఎస్‌యులకు అలాగే సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థల హిందీ అధికారులు & సమన్వయకర్తలకు 'నగర్ రాజభాష సమ్మాన్' ఈ సందర్భంగా అందచేశారు.

ప్రతి '3' కేటగిరీలలో మూడు కార్యాలయాలు 1వ, 2వ & 3వ స్థానాలకు గుర్తించబడ్డాయి మరియు వాటి ఆదర్శవంతమైన పనితీరుకు కన్సోలేషన్‌గా గుర్తించబడ్డాయి.

కేటగిరీ-Iలో, హెచ్‌పిసిఎల్-విశాఖ రిఫైనరీ, ఎన్‌టిపిసి సింహాద్రి మరియు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వరుసగా ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులను పొందగా, కేటగిరీ-IIలో, గెయిల్, హెచ్‌పిసిఎల్- విశాఖ ప్రాంతీయ కార్యాలయం, సెయిల్ - బ్రాంచ్ ట్రాన్స్‌పోర్ట్ & షిప్పింగ్ ఆఫీస్ మరియు ఎఫ్‌సిఎల్ ప్రాంతీయ కార్యాలయం పొందగా కేటగిరీ-IIIలో, ఎంఎస్‌టిసి, హెచ్‌పీసీఎల్, ఎల్‌పీజీ మరియు ఈసీజీసీ (ఎగుమతి క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 1వ, 2వ & 3వ స్థానాలను పొందాయి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీ అతుల్ భట్ మాట్లాడుతూ, 2022-23 సంవత్సరానికి గాను భారత హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా ప్రాంతీయ అధికారిక భాషా అవార్డును సాధించినందుకు టాలిక్(పిఎస్‌యు) విశాఖపట్నం ని అభినందించారు. భారతదేశం యొక్క స్థానిక అవార్డు గెలుచుకున్న పిఎస్‌యులను , టాలిక్ (అండర్‌టేకింగ్) కృషిని మరియు విశాఖపట్నంలో హిందీని ప్రగతిశీలంగా ఉపయోగించడంలో అన్ని సభ్య సంస్థల మద్దతును

(మిగతా 2లో)

# సత్ఫలితాలిస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్

పాడేరు, (విశాఖ సమాచారమ్): వరద ప్రభావిత మండలాల్లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలు సత్ఫలిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ ముందు చూపుతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలు వరద బాధితులకు ముమ్మర సహాయక చర్యలు అందించడానికి దోహద పడుతున్నాయి. వరద ప్రభావంతో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సంఘటనలు, గోదావరి, శబరి నదుల ప్రవాహంతో పాటు పలు వాగులకు సంభవిస్తున్న వరదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. కమాండ్ కంట్రోల్ రూములకు అందిన సమాచారాన్ని జిల్లా కలక్టర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక "2024 వరదలు" గ్రూపునకు అందించడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మైకుల ద్వార ప్రజలకు వెంటనే తాజా సమాచారం అందించడం, రానున్న ప్రమాదాలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలి0చడం జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ వరద ప్రభావిత మండలాలకు ఈనెల 21 వతేదీన చేరుకుని చింతూరులో బస చేసారు. వరద ముప్పును గుర్తించి గోదావరి, శబరి నదుల వరద ప్రవాహాన్ని ముందుగా అంచనా వేసి చింతూరు కూనవరం, వి. ఆర్. పురం ఎటపాక మండలాల్లో కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసారు. అదేవిధంగా చింతూరు లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ వరద ప్రభావిత గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ, బాధితుల కష్టాలను, బాధలను స్వయంగా పరిశీలించి తగిన సహాయ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్ల కుండా భద్రతా చర్యలు చేపట్టారు. ముంపు గ్రామాలలో ట్రాక్టర్లపై, నాటు బోటులపై పర్యటించి సహాయక సేవలను స్వయం పర్యవేక్షిస్తున్నారు. విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యపు పనులపై అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. నాలుగు మండలాల పరిధిలోని గ్రామాల్లో వరద ప్రభావం వలన జరుగుతున్న నష్టాలను కమాండ్ కంట్రోల్ రూంలకు చేరవేసే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. వరద బాధితులను పునరావాన సహాయక కేంద్రాలకు తరలించి వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. తాత్కాలికంగా పునరావాసం నిర్మించుకుంటున్న బాధితులకు తార్పాలిన్లు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు,కూరగాయలు పంపిణీ చేస్తున్నారు. బాధితులకు దోమ తెరలు పంపిణీచేసి వాటిని



సక్రమంగా వినియోగించే విధంగా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. వరదల వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలలో సీజనల్ వ్యాదులు ప్రభలకుండా వైద్య సిబ్బందిని ముందుగానే అప్రమత్తం చేసి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామాలలో అవసరమైన చోట అత్యవసరంగా బోరు బావులను నిర్మించి తాగునీటి సౌకర్యాలను కల్పించారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా చేస్తున్నారు.

చింతూరు డివిజన్ ఫరిధిలోని నాలుగు మండలాల్లో 149 పునవాన కేంద్రాలను ఏర్పాటు చేసారు. ప్రస్తుతం 61 పునరావాస కేంద్రాలకు సుమారు 4500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వసతి, భోజన సదుపాయాలు, వైద్య సేవలను సమకూరుస్తున్నారు. సంయుక్త కలెక్టర్ డా. ఎం.జే. అభిషేక్, పాడేరు ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్, రంపచోడవరం ఐటిడి ఏ పి. ఓ సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్లను ముంపు మండలాల నోడల్ అధికారులుగా నియమించి బాధితులకు సత్వర సహాయ చర్యలు అందించే విధంగా పర్య వేక్షిస్తున్నారు. బాధితులకు సరఫరా చేస్తున్న రేషన్, ఇతర నిత్యావసర సరుకులు, కూరగాయలు, డీజిల్ పెట్రోల్, కిరోసిన్ లో ఎటువంటి అక్రమాలు జరగకుండా తగిన హెచ్చరికలు జారీ చేసి పారదర్శకంగా లబ్దిదారులకు అందే విధంగా పర్యవేక్షిస్తున్నారు. గర్భవతులు, బాలింతలను మందుగానే అసుపత్రులకు తరలించి తగిన సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు, వృద్దులకు అంగన్వాడీ కేంద్రాల నుండి పాలు, బాలామృతం సరఫరా చేస్తున్నారు. భారీ వర్షాల వలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాఠశాలలకు ముందుగానే సెలవులు ప్రకటించారు.

జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ మండల అభివృద్ధి అధికారులు, తాహశీల్దారులు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ట్రాన్స్కో అధికారులు, రహదారులు భవనాల ఇంజనీరింగ్ అధికారులు, పోలీస్ అధికారులతో ప్రతీ రోజు సాయంత్రం టెలీ కాన్ఫరెన్సులు నిర్వహించి సలహాలు సూచనలు అందిస్తున్నారు. అధికారులు ముంపు గ్రామాలలో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని మరింత మెరుగైన సేవలు అందించే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రతీ లబ్దిదారునికి పారదర్శకంగా అందించే విధంగా అదేశాలు జారీ చేస్తున్నారు. వరదల వలన జరిగిన ఇళ్ల నష్టాలు, విద్యుత్తు అంతరాయం, తెగిపోయిన రోడ్లు, గృహాలకు జరిగిన పూర్తి నష్టాలు, పాక్షిక నష్టాలను గణన చేసి నివేధికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసారు. జాప్యం లేకుండా వరద బాధితులకు సేవలు అందించాలని, నష్టాలను అందించడంలో అక్రమాలకు పాల్పడినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఇప్పటివరకు సుమారు 1175 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని (అగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి) అడ్వాన్స్ గా పంపిణీ చేసారు. సుమారు 34వేల కిలోల కందిపప్పు, 34 వేల లీటర్ల పామోలిన్ ఆయిల్ పంపిణీ చేసారు. 5,300 టార్చ్ లైట్లు, 25 సోలార్ లైట్లు, 20 వేల కొవ్వొత్తులు, 12 వేల కేజీల ఉప్పు ప్యాకెట్లు కొనుగోలు చేసారు. 127 వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 3630 మందికి చికిత్సలు అందజేశారు. ముంపుకు గురైన 190 అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు, మూడు నుండి ఆరు నెలల బాలింతలు, ఏడు నెలల నుండి మూడేళ్ళ చిన్నారులకు పూర్తి అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణకు 80 మంది పారిశుధ్య కార్మికుల సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారు. అదేవిద0గా సుమారు 59 వేల కేజీల సున్నం, 21 వేల కేజీల బ్లీచింగ్, 140 లీటర్ల ఫినాయిల్ సిద్ధం చేసి పారిశుధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. 56 గ్రామాలకు విధ్యుత్ సరఫరా నిలిచిపోగా అధికారులు స్పందించి అవకాశం ఉన్న అన్ని గ్రామాలకు విధ్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

## తుఫాను కారణంగా గృహాలు దెబ్బతిన్న బాధితులకు బియ్యం పంపిణీ



చింతపల్లి, (విశాఖ సమాచారమ్): తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న సుమారు 22 గృహాలకు సంబంధించి పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను ఆదుకునే క్రమంలో తమ శాఖ ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరిగిందని స్థానిక తహసిల్దార్ టి రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలుచోట్ల పూరి గుడిసెలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న గృహాలను గుర్తించి బాధితుల వివరాలు సేకరించడం జరిగిందని, ఆ వివరాలను జిల్లా కలెక్టర్ కు పంపించడం జరిగింది అన్నారు. ముందస్తుగా బాధితులకు బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వీఆర్వో ఎస్ కృష్ణారావు, రెవిన్యూ సిబ్బంది ప్రసాద్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సురేంద్ర



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మహావిశాఖ జీవీఎంసీ కమిషనర్ పి సంపత్ కుమార్ నుతెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, 81 డివిజన్ ఇంచార్జ్ మళ్ళ సురేంద్ర మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా కమిషనర్ తో మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక చోట్ల వాటర్ ట్యాంకులు పనిచేయడం లేదని,తమరు ఒక్కసారి అనకాపల్లి విజిట్ చేసి సమస్యల పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకుంటారని, అలాగే కొత్తగా బాధ్యతలు చేపట్టిన మీరు అనకాపల్లి వచ్చేటప్పుడు ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనానికి రావాలని తెలియజేశారు. కమిషనర్ మాట్లాడుతూ కచ్చితంగా మీరు చెప్పిన సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని,అమ్మవారి దర్శనం కూడా చేసుకుంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి శివ నాయుడు, జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించండి



ఎటపాక/చింతూరు, (విశాఖ సమాచారమ్): వరద ముంపు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జే. అభిషేక్ గౌడ్ ఆదేశించారు. గురువారం ఎటపాక మండలంలోని టిపి వీడు, నెల్లిపాక, గన్నవరం గ్రామాలలోని వరద ముంపు బాధితుల పునరావాసం కేంద్రాలు పరిశీలించి నిత్యవసర వస్తువులు సక్రమంగా అందినదీ లేనిది ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల పునరావాస కేంద్రాల్ల, ఆయా గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని, అంటువ్యాధులు ప్రభాలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వరదల సమయంలో నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరవాస కేంద్రాలలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జేసి సూచించారు.

శుక్రవారం 26 -07-2024
క్రోధి నామ సంవత్సరము
దక్షిణాయణం, గ్రీష్మరుతువు
ఆషాఢ మాసం

పంచాంగం

| | |
|---|---|
| తిథి | : బ. షష్ఠి తె. 03.29 |
| నక్షత్రం | : ఉత్తరాభాద్ర రా. 07.05 |
| వర్జ్యం | : లేదు |

## జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి మండలం టి నగరపాలెం గ్రామంలో గురువారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, పార్టీ భీమిలి నియోజక వర్గ ఇంచార్జి డాక్టర్ పంచకర్ల నాగ సందీప్ సూచనలతో తాము సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని పార్టీ శాఖ అధ్యక్షులు నక్క శ్రీధర్ తెలిపారు. కార్యక్రమం లో మండల శాఖ కార్యదర్శి పి కొండబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

### జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం. పోలినాయుడు తెలిపారు. ఈ మేరకు ప్రకటన జారీచేశారు.

జూలై 27వ తేదీ ఉదయం 10.30గం.లకు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని అన్నారు.

సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని జడ్పీ సీఈవో విజ్ఞప్తి చేశారు.

## 27న ఆర్ఐటిఐలో రెండవ విడత కౌన్సెలింగ్

### చింతపల్లి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రాజారావు



చింతపల్లి, (విశాఖ సమాచారమ్): ఈనెల 27వ తేదీన చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటిఐలో రెండవ విడత ప్రవేశాల కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నామని చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటిఐ ప్రిన్సిపాల్ కే రాజారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందరూ ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866108607, 9494377833 ఫోన్ నెంబర్లకు సంప్రదించాల్సిందిగా సూచించారు.

## కొత్తూరు సబ్ స్టేషన్స్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): 132కేవీ కసింకోట సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో గల 33/11 కె.వి కొత్తూరు సబ్‌స్టేషన్స్ పరిధిలో కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, మూలపేట, సంపతిపురం, వేట జంగాల పాలెం, రంగలి వాని పాలెం, కుంచంగి, కూండ్రం మొదలగు గ్రామాలకు ఈ నెల 26 తేదీన 9 గంటలు నుండి 2 గంటలు వరకు గృహ అవసరాల విద్యుత్ మరియు వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు అందరూ సహరించాలని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ కోరారు .




(మొదటి పేజీ తరువాయిలు)

## ఏపీ అసెంబ్లీలో శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల

అడ్డుకున్నారన్న సీఎం చంద్రబాబు.. అడ్డుకోవడం భావ ప్రకటనా స్వేచ్ఛ అని నాటి డీజీపీ కామెంట్ చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

## విమాన టికెట్ ధరల ఆకస్మిక పెంపుపై ఎంపీల ఫిర్యాదు

సామాన్యపౌరులకు కూడా విమాన ప్రయాణం అందుబాటు ధరల్లో ఉండేలా చూస్తామన్నారు.

"వినియోగదారుడే దేవుడు. మాకు వారే ప్రథమ ప్రాధాన్యం. చౌక విమానయానం కోసం సాధ్యమైనంత మేర ప్రయత్నాలు చేస్తాం. అంతర్జాతీయ మార్గాల్లోనూ హాలిడే సీజన్లలో టికెట్ ధరలు అధికంగా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపైనా దర్యాప్తు జరుపుతాం. అయితే, ప్రస్తుత నిబంధనల ప్రకారం.. విమాన టికెట్ ధరలను ప్రభుత్వం నియంత్రించలేదు. రద్దీ, సెలవులు, విమాన ఇంధన ధర, పోటీ వంటి అంశాలపై ఈ ధరలు ఆధారపడి ఉంటాయి" అని కేంద్రమంత్రి వివరించారు.

## జగన్.. అసెంబ్లీకి వచ్చి ఆ పేర్లు చెప్పే దమ్ము లేదా?

లాభం?రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆయన కుట్ర చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలా ప్రవర్తించారో మర్చిపోయారా?శాంతిభద్రతల గురించి మాట్లాడే హక్కు ఆయనకు ఉందా?. హెూంమంత్రిగా జగన్‌ను అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నా. హత్యల వివరాలు అందిస్తే తగిన విచారణ చేయిస్తాం. తప్పుడు వివరాలు ఇచ్చినట్టు తేలినా చర్యలు తీసుకుంటాం. " అని అనిత నిలదీశారు.

## కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ ఆగస్టు 8 వరకు పొడిగింపు

కేజ్రీవాల్ దరఖాస్తును తిరస్కరించింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై తనతరపు న్యాయవాదుల వాదనల విన్న ఢిల్లీ హైకోర్టు జులై 18వ తేదీన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

## సిటీ ఆపరేషన్స్ సెంటర్ ను సందర్శించిన జీవీఎంసీ కమిషనర్

వాటి పరిష్కరణ పై ప్రజల అభిప్రాయాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అందిస్తున్న సమాచార వివరాలు, పలు జంక్షన్ లలో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీయగా.., వాటిని వివరిస్తూ, నగరంలో వీధి దీపాల నిర్వహణ, కంపాక్టర్, క్లాప్ వాహనాలు కు జిపిఎస్ అనుసంధానం, ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ పై నిత్య పరిశీలన మొదలైనవి సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా నిర్వహించడం జరుగుతున్నదని ఫ్లుయింటిగ్రిడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ఆపరేషన్స్ మేనేజర్ సమీరా వివరించగా వాటిని సి.ఓ.సి స్క్రీన్ పై కమిషనర్ తిలకించారు. ప్రజలతో సిటీ ఆపరేషన్స్ సెంటర్ సిబ్బంది గౌరవప్రదంగా మాట్లాడాలని, వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని, టోల్ ఫ్రీ నెంబర్, వాట్సాప్ ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను అధికారులకు చేరవేసి వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సి.ఓ.సి సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. సి.ఓ.సి ద్వారా అన్ని సర్వీసులు పూర్తిస్థాయిలో నిర్వహణ జరిగేటట్లు పర్యవేక్షించాలని పర్యవేక్షక ఇంజనీర్ ను కమిషనర్ ఆదేశించారు. తదుపరి సందర్శనలో అన్ని సర్వీస్ లను మరొకసారి సమీక్షిస్తానని కమిషనర్ తెలిపారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో జివిఎంసి కార్యనిర్వహక ఇంజనీరు సుబ్బారావు స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## "వైభవంగా జరిగిన పట్టణ అధికార భాషా అమలు కమిటీ- (టౌన్ అఫీసియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ తొలిక - పిఎస్‌యు సమావేశం"

అతుల్ భట్ అభినందించారు.

అనిర్బన్ కుమార్ బిస్వాస్, డివై. డైరెక్టర్ (అమలు), భారత హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బెంగళూరు, ఈ సమావేశంలో అధికార భాషా అమలు విషయం లో సభ్య సంస్థలు -(పిఎస్‌యులు) సాధించిన పురోగతిని సమీక్షించారు మరియు సభ్యుల కార్యాలయాల మొత్తం పనితీరును ప్రశంసించారు. అనిర్బన్ కుమార్ బిశ్వాస్ ప్రభుత్వం జారీ చేసిన వివిధ మార్గదర్శకాలను వివరించారు.

డాక్టర్ రీటా త్రివేది, అసిస్టెంట్ డైరెక్టర్, హిందీ టీచింగ్ స్కీమ్, హెూం మంత్రిత్వ శాఖ విశాఖపట్నం-ఇంఛార్జి అందుబాటులో ఉన్న హిందీ శిక్షణ సౌకర్యాల గురించి వివరించి, సభ్య కార్యాలయాల సభ్యులను ఈ శిక్షణా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ శ్రీ సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ, స్థానిక పిఎస్‌యులలో హిందీని ప్రచారం చేయడంలో ఆర్ఐఎన్ఎల్ యొక్క సిఎండి అతుల్ భట్ నాయకత్వాన్ని అభినందించారు మరియు అతుల్ భట్ విలువైన మార్గదర్శకత్వం కోసం ధన్యవాదాలు తెలిపారు.

విశాఖపట్నంలోని వివిధ పిఎస్‌యుల (పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్) అధిపతులు, జి గాంధీ, సిజిఎం (హెచ్‌ఆర్) ఆర్ఐఎన్ఎల్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా 'విశాఖ ధార' టాలిక్ హిందీ మ్యాగజైన్ 8వ సంచికను శ్రీ అతుల్ భట్, శ్రీ సంజయ్ కుమార్ సిన్హా, అనిర్బన్ కుమార్ బిస్వాస్, డాక్టర్ రీటా త్రివేది, శ్రీ జి గాంధీ మరియు డాక్టర్ లలన్ కుమార్ విడుదల చేశారు.

డాక్టర్ లలన్ కుమార్, జిఎం (రాజ్‌భాష & హాస్పిటాలిటీ) ఆర్ఐఎన్ఎల్ & మెంబర్-సెక్రటరీ మరియు డాక్టర్ టి.హైమవతి, ఎజిఎం (రాజ్‌భాష) ఆర్ఐఎన్ఎల్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వి.సుగుణ, సీనియర్ మేనేజర్ (రాజ్‌భాష) ఆర్ఐఎన్ఎల్ కృతజ్ఞతలను ప్రతిపాదించారు.

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 26-07-2024


## సర్వం బ్రహ్మమయం

మన పెద్దలు, పండితులు ఈ అనంత సృష్టి అంతా బ్రహ్మదే అంటుంటారు. అంటే 'సర్వం బ్రహ్మమయం' అని అర్థం. అంటే ఏమిటో తెలుసుకుందాం.

మానవ సృష్టికి మొదటి మానవుడు- బ్రహ్మ.

ప్రజలందరికీ తండ్రి, ప్రజాపిత ఆ బ్రహ్మ దేవుడు.

అన్నింటికంటే గొప్ప విద్య- బ్రహ్మ విద్య

బ్రహ్మ జ్ఞానాన్ని ఆచరించేవాడు. బ్రహ్మచారి.

బ్రహ్మజ్ఞానాన్ని కర్మేంద్రియాల ద్వారా చూపడమే బ్రహ్మచర్యము.

అన్నిటికంటే గొప్ప ముహూర్తం- బ్రహ్మ ముహూర్తం.

అన్ని ఉత్సవాలలో కెల్లా గొప్పది- బ్రహ్మోత్సవం.

అతి గొప్ప ప్రయత్నం- బ్రహ్మ ప్రయత్నం

ఎవరూ చెరపలేని రాత- బ్రహ్మరాత.

ఈ ముడిని ఎవరు విప్పలేరు- బ్రహ్మముడి.

ఈ అస్త్రానికి తిరుగులేదు - బ్రహ్మాస్త్రం.

అతి చెవుడు ఉంటే - బ్రహ్మ చెవుడు.

ఏదైనా గొప్ప రహస్యం- బ్రహ్మ రహస్యం

ఎవరికైనా గొప్పగా ఆహ్వానం పలికితే ఏమి పట్టారు అంటారు? - బ్రహ్మరథం

గొప్ప రాక్షసిని ఏమంటారు?- బ్రహ్మ రాక్షసి

ఏదైనా తినేది రుచిగా ఉంటే ఏమని అంటారు? - బ్రహ్మాండం

బాలవాక్కుని ఏమంటారు? బ్రహ్మవాక్కు

ఏ దేవుడు దిగివచ్చినా వీరు మారరు అంటారు? - బ్రహ్మదేవుడు

సరస్వతికి మరొక పేరు- బ్రహ్మ మానస పుత్రిక

స్వర్గానికి మరొక పేరు బ్రహ్మ పగలు

నరకానికి మరొక పేరు- బ్రహ్మ రాత్రి

ఆనందంలో కెల్లా గొప్ప ఆనందం- బ్రహ్మానందం

అన్నింటికంటే గొప్ప ఉపదేశం- బ్రహ్మోపదేశం

అన్నింటికంటే పెద్ద నది- బ్రహ్మ పుత్రానది

బ్రహ్మ తత్వము బోధించే వారు- బ్రాహ్మణులు.

ఇలా అన్నిటా నిండినవాడు ఆ బ్రహ్మదేవుడు. అందుకే సర్వం బ్రహ్మానందం.

## మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పీలా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రినారా లోకేష్ బాబుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ . ఈ సంధర్బంగా వారు కొద్ది సేపు చర్చించారు.

## విద్యార్థులకు విద్యాభ్యాసన సామాగ్రిని పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): డా॥ఎస్.వి.ఎస్ కిరణ్ కుమార్ సారధ్యంలో నడుస్తున్న కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ, సీతమ్మధార వారు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వెంకోజీపాలెం లో విద్యార్థులకు అవసరమైన పరీక్ష అట్టలు, పుస్తకాలు, పెన్సిల్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శ్రీ.బి.ఎస్.సుబ్బారావు , కోశాధికారి శ్రీమతి.ఎన్.అనిత ,కార్యదర్శి శ్రీ.డి.నరేంద్ర పాల్గొన్నారు. కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ గతంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా ఈ కార్యక్రమం తమకు ఎంతో సంతృప్తిని కలిగించిందని సంస్థ అధ్యక్షులు తెలియజేశారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.జ్యోతి గారు,ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు..


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

మెటీరియల్స్ సరఫరా

టెండరు నెం. 30246682, తేది. 17.07.2024

పని పేరు: డ్రోన్ కెమెరా (థర్మల్)తోపాటు కావలసిన యాక్సెసరీస్ మరియు ల్యాప్‌టాప్, తయారీ: BOOM / MAVIC: IDEAFORGE/ KAM, (ల్యాప్ టాప్ ఇంటెల్ కోర్ I5 ప్రాసెసర్ 16 GB DDR4-3200 ర్యామ్ 512 GB SSDD హార్డ్‌డ్రైవ్ 2GB గ్రాఫిక్ కార్డు), ల్యాప్‌టాప్ తయారీ: DELL/ASUS/HP. వారంటీ కాలం: డెలివరీ తేదీ తర్వాత 30 నెలలు, తనిఖీ చేయు వారు: TPI ఏజన్సీ, పరిమాణం: 4 సెట్లు.

సూచన: మెటీరియల్ 45 రోజులులోగా సప్లయి చేయాలి.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 16.08.2024న 1500 గంటలకు

పూర్తి వివరాలు లభించు చోటు: www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్, వాల్తేరు

PR-339/P/24-25


## పనిచేయని ఈవిఎంల తరలింపు

విజయనగరం: నెల్లిమర్ల ఈ వి ఎం గోడౌన్ లో ఉన్న పని చేయని, అదనంగా ఉన్న, ఎన్నికలలో డెమో కు వినియోగించిన డమ్మీ ఈ వి ఎం లను బెంగుళూరు లో నున్న బెల్ కంపెనీ కు గురువారం రెండు వాహనాల లో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యం లో పంపించారు. ఎన్నికలలో వినియోగించని (డిఫెక్ట్ ) ఈ వి ఎంలలో బి.యు లు 174 , సి యు లు 930 , వివిపాట్ లు 224 యూనిట్లను బెల్ కు పంపించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, పోలీస్, పొలిటికల్ ప్రతినిధుల ఆధ్వర్యం లో వాహనాల్లోనికి ఎక్కించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి ఇద్దరేసి పోలీస్ ఎస్కార్ట్ తో పాటు రెవిన్యూ ఉద్యోగిని ఇంచార్జ్ గా పెట్టి వాహనాలను పంపించాలని, ఈవిఎంలను ఎక్కించినపుడు, దించునపుడు వీడియోగ్రఫీ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎస్.డి. అనిత, ఎం.వి. ఆర్.డి.ఓ సూర్యకళ, తహసిల్దార్ ధర్మ రాజు, ఈవిఎంల ఇంచార్జ్ ఉమాశంకర్, నెల్లిమర్ల మున్సిపల్ కమీషనర్ పి. బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## కాలువలు కోతకు గురికాకుండా చూడాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): తోటపల్లి ప్రాజెక్టు రక్షణ కట్టలు, ప్రధాన కాలువలు కోతకు గురు కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ప్రధాన కుడికాలువ, స్పిల్ వే రెగ్యులేటర్ నీటి ప్రవాహస్థాయిని గురువారం పరిశీలించారు. తోటపల్లి ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ వద్ద మిషనరీ కాంపోనెంట్స్,సాగు నీటి విడుదల చేసే గేటులను చూసారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు. తోటపల్లి ప్రాజెక్టు బ్యారేజీ వద్ద నీటి నిల్వ స్థాయి, ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు అందుతున్న సాగునీరు, విస్తీర్ణము, మిగుల జలాల విడుదల , ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద ముంపు గ్రామాలు, తదితర విషయాలపై ఇంజనీరింగ్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ ఇరువైపులా ఉండే బండలను వర్షాల వల్ల కోతకు గురి కాకుండా ప్రత్యేక పర్యవక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన గుర్రపు డెక్క నివారణకు శాస్త్రీయ, సాంకేతిక శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు కాలువల నిర్వహణ పక్కాగా చేపట్టాలని అన్నారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు, కాలువల నిర్వహణకు లష్కర్ల కొరత ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన నియమించాల్సి ఉందని, తోటపల్లి పిల్ల కాలువల త్రవ్వకం కోసం భూమి సేకరించాల్సిందని, ప్రధాని కుడి కాలువ శివారు భూములకు సాగు నీటి కొరత లేకుండా సాఫీగా సరఫరా అయ్యేందుకు కుడి ప్రధాన కాలువలను కొన్ని రీచ్ ల వద్ద సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరిపించాలని కలెక్టర్ దృష్టికి ఇంజనీరింగ్ అధికారులు తీసుకువచ్చారు. సాగునీటి కాల్వ పనులకు సక్రమంగా నిధులు వినియోగానికి తగిన యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రఘు, జే ఈ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్ ని సత్కరించిన మందపాటి దంపతులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన పి. సంపత్ కుమార్ ని అనకాపల్లి జోన్ 82 వ వార్డ్ కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు ప్రధాన కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికి, అభినందించారు. ఈ సందర్భంగా 82 వ వార్డు అభివృద్ధికి సహకరించాలని ఆయనను విజ్ఞప్తి చేశారు.

## శివ సన్నిధిలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): మండలంలోని అడ్డాపు శీల గ్రామ సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పూర్ణ కుంభంతో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలెక్టర్ కు తీర్థప్రసాదాలను పురోహితులు అందజేశారు. ఈ సందర్భంగా స్వయంభూగా వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ విశిష్టతను, పురాతన చరిత్రను పురోహితులు కృష్ణ చంద్ర శర్మ, కలెక్టర్ కు వివరించారు.

## బంగారు భవితకు బాటలు వేయాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): విద్యార్థి దశ నుండే ఆసక్తిగల రంగాల్లో లక్ష్యాన్ని ఏర్పరచుకొని బంగారు భవితకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు స్థానిక ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని అన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, లలిత కళలు వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. రక్త హీనత లోపం తలెత్తకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన ప్రార్థనా గీతాలు, నాడు - నేడు నాటిక, సామూహిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుక నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారి జి.పగడాలమ్మ, ఎమ్ ఈ ఓ కె.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పీవీ.ప్రసాద్,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం చూపిన గ్రామ సందర్శన

విజయనగరం: ప్రతి గురువారం నిర్వహిస్తున్న గ్రామ సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ గురువారం బొండపల్లి మండలం ముద్దూరులో పర్యటించారు. గ్రామంలోని పలు వీధులు సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా కలెక్టర్ పర్యటనతో గ్రామస్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం లభించింది. గ్రామంలోని రెల్లిపేటలో తమకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా కావడం లేదని ఆ ప్రాంత మహిళలు కలెక్టర్ కు విన్నవించడంతో ఆ సమస్యపై కలెక్టర్ గ్రామీణ నీటిసరపరా అధికారులతో ఆరా తీశారు. గ్రామంలోని కొందరు తాగునీటి పైప్‌లైన్లకు మోటార్లు బిగించి నీటిని అక్రమంగా మళ్లిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై వెంటనే చర్య తీసుకొని అక్రమంగా మోటార్లతో నీటిని తోడేస్తున్నవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు శుక్రవారం సాయంత్రంలోగా రెల్లిపేట ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసి తనకు రిపోర్టు చేయాలని గ్రామీణ నీటిసరఫరా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రైవేటు భవనంలో కొనసాగుతుండటంపై ప్రశ్నించారు. వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని మంజూరు చేశారని, నిర్మాణం అసంపూర్తిగా వున్నట్టు వైద్యాధికారి వివరించారు. దీనిపై కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌తో ఆరా తీశారు. వచ్చే ఆగష్టు 10వ తేదీలోగా భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అప్పగించాలని స్పష్టంచేశారు. ఆరోగ్యకేంద్రం పనితీరుపై కలెక్టర్ తనిఖీ చేశారు. ఓ.పి. తనిఖీలు, వయోవృద్ధులకు, బి.పి., మధుమేహ వ్యాధిగ్రస్తులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, మందుల లభ్యత తదితర అంశాలపై తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రం పరిధిలో రెండు క్షయ వ్యాధి కేసులు నమోదైనట్లు సిబ్బంది వివరించగా అందుకు కారణాలు, వారికి అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు.

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పలు తరగతి గదులను సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులతో సంభాషించి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకొనే ప్రయత్నం చేశారు. పలువురు విద్యార్థులతో ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించారు. వారికి



ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లు అందజేసిందీ లేనిదీ ఆరా తీశారు. యూనిఫాంలు ఇవ్వలేదని ఉపాధ్యాయులు తెలుపగా ఎందుకు ఇవ్వలేదని కలెక్టర్ ప్రశ్నించారు. పలువురు విద్యార్థులు షూలు వేసుకోకుండా పాఠశాలకు రావడాన్ని గమనించి వారికి షూలు వేసుకొనే విధంగా అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతిలోని పలువురు బాలికలు ఉత్సాహంగా లేరని పేర్కొంటూ అటువంటి వారిని ముందు బెంచీల్లో కూర్చోబెడుతూ వారిని నిత్యం గమనిస్తూ వుండాలని చెప్పారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా వుంచడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి ఆహార పదార్థాల రుచిని పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. వారికి గుడ్లు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో కొందరు పిల్లలు తక్కువ బరువుతో వున్నారని, అందరూ ఆరోగ్యంగా వయస్సుకు తగిన బరువు వుండాలని, దీనిపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. గ్రామంలోని కుటుంబాలకు తగినట్టుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు లేరని తెలుస్తోందని, ఇందుకు కారణాలు తెలుసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో 390 కుటుంబాలు వుండగా ఇందులో కేవలం 11 మంది పిల్లలు మాత్రమే అంగన్‌వాడీలో వుండటంపై ఇంటింటికీ వెళ్లి గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లలపై సర్వే చేయాలని ఐ.సి.డి.ఎస్., వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఒక మొక్కను కలెక్టర్ నాటారు.

గ్రామంలోని యువతతో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడారు. వారు భవిష్యత్‌లో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నారు, ఏ వృత్తుల్లో చేరాలనుకుంటున్నారనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి యువతీ యువకునికి జీవితంలో ఒక లక్ష్యం వుండాలని చెప్పారు. గ్రామంలో ఇంటర్ ఆపై విద్యార్హతలు కలిగి ఖాళీగా వుంటున్న యువత ఎంతమంది వున్నారనే అంశంపై ఇంటింటి సర్వే చేసి నివేదించాలని ఎంపిడిఓ, నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్‌కు ఒక వ్యక్తి తన ఇంటికి సంబంధించిన ఇంటిపన్ను చెల్లిస్తే నిరాకరిస్తున్నట్టు ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తూ ఆ సమస్య పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఉపాధిహామీ పనులపై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదులు చేయగా దీనిపై విచారణ చేయాలని ఎంపిడిఓను ఆదేశించారు.

గ్రామంలో పారిశుద్ధ్య పరిస్తులపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసారు. అన్ని రోడ్లు పరిశుభ్రంగా, కాల్వల్లో పూడికలు తీసి వుండటం పై గ్రామా పంచాయతీ సిబ్బందిని అభినందించారు.

గ్రామ సందర్శన కార్యక్రమంలో నోడల్ అధికారి, భూగర్భ జలశాఖ డి.డి. దుర్గాప్రసాద్, ఎంపిడిఓ, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, గ్రామంలోని పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో గ్రామ సందర్శన**

గ్రామాలు, పట్టణాల్లో నివసిస్తున్న ప్రజల సామాజిక, వ్యక్తిగత సమస్యలు తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన గ్రామ సందర్శన కార్యక్రమం లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా యీ కార్యక్రమం ప్రారంభించిన తర్వాత రెండో గురువారం అధికారుల బృందాలు మండలంలోని ఒక గ్రామాన్ని, మునిసిపల్ ప్రాంతాల్లో ఒక వార్డును సందర్శించి ఆయా గ్రామాలు, వార్డుల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేశాయి. మండల, పట్టణ నోడల్ అధికారి నేతృత్వంలో తహశీల్దార్, ఎంపిడిఓ, వ్యవసాయ, గ్రామీణ నీటిసరఫరా, ఇంజనీరింగ్, వైద్యాధికారులు యీ కార్యక్రమంలో పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో మండల స్థాయిలో పరిష్కరించదగిన సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

## ఈ డ్రింక్స్ ఖాళీ కడుపుతో తాగితే బరువు తగ్గడంతో పాటు, శరీరంలో వ్యర్థాలుతొలగుతాయి



పేలవమైన జీవనశైలి, చెడు ఆహార అలవాట్లు, అనారోగ్యాల కారణంగా మన శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మన బాడీలో టాక్సిన్స్ ఎక్కువైతే శరీర భాగాల పనితీరుపై ప్రభావం పడుతుంది. మనం ఆరోగ్యంగా ఉండటానికి, శరీరాన్ని క్లీన్ చేయడం చాలా అవసరం. డీటాక్సిఫికేషన్ మన రక్తాన్ని శుద్ధి చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. బాడీ డీటాక్సిఫికేషన్ హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది, నిద్రను మెరుగుపరుస్తుంది, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. డిటాక్సిఫికేషన్ శరీర జీవక్రియను మెరుగుపరుస్తుంది. డీటాక్సిఫికేషన్ కిడ్నీలు, లంగ్స్, లివర్ వంటి ముఖ్యమైన అవయవాల్లో పేరుకున్న వ్యర్థాలను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. కొన్ని డిటాక్స్ డ్రింక్స్ మన శరీరంలోని వ్యర్థాలను తొలగించడానికి తోడ్పడతాయి. ఇవి టాక్సిన్స్ తొలగించడానికే కాదు, కేలరీలను తగ్గించి, బరువ తగ్గడానికీ సహాయపడతాయి.

**వట్టివేరు డ్రింక్** మన బాడీని కూల్ చేసే డ్రింక్స్ మనం ఎక్కువగా ప్రిఫర్ చేస్తూ ఉంటాం. మన శరీరాన్ని కూల్ చేయడానికి వట్టివేరు డ్రింక్ అద్భుతంగా పని చేస్తుంది. ఇది శరీరానికి చలువ చేస్తుంది. ఇవి సహజసిద్ధంగా విష వ్యర్థాలు, విష సూక్ష్మక్రిములతో పోరాడుతుంది. వెట్టివేరులో ఐరన్, మాంగనీస్, విటమిన్ బి6 వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరచడంలో, హైపర్‌టెన్షన్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడతాయి. వట్టి వేరు డ్రింక్ తాగితే శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తొలగుతాయి. ప్రతి రోజు ఉదయం వట్టివేరును నీళ్లలో మరిగించి ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్తాయి, బరువు కూడా తగ్గుతారు. నిద్రలేమి సమస్య నుంచీ ఉపశమనం లభిస్తుంది. వట్టివేరులోని యాంటీసెప్టిక్ గుణాలకు లివర్, కిడ్నీలోని వ్యర్థాలను ఫిల్టర్ చేసే సామర్థ్యం ఉంటుంది. ఈ డ్రింక్ బరువు తగ్గడానికీ సహాయపడుతుంది.

**ధనియాల టీ** ధనియాల టీ జీర్ణఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. మన జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ధనియాలలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. ధనియాలలో పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్లు ఎ, కె, సి పుష్కలంగా ఉంటాయి. ధనియాలు మూత్రవిసర్జనకు సహాయపడతాయి. ఇవి శరీరంలో పేరుకున్న టాక్సిన్స్‌ను మూత్రం ద్వారా తొలగిస్తాయి. ధనియాలు జీవక్రియను నియంత్రించడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే ఫైబర్ కడుపును నిండుగా ఉంచుతుంది. త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. ఇది మీరు రాత్రి 1 గ్లాస్ నీటిలో 2 చెంచాల ధనియాలు వేసి నానబెట్టిండి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీళ్లు తాగితే మంచిది. ధనియాల టీ తాగిన తర్వాత వర్కవుట్ చేస్తే శరీరంలోని వ్యర్థాలన్నీ చెమట ద్వారా బయటకు వెళ్లిపోతాయి.

**జీలకర్ర, నిమ్మరసం** జీలకర్ర శరీర జీవక్రియను మెరుగుపరుస్తుంది. గట్ ఆరోగ్యానికి సహాయపడుతుంది. శరీరంలోని అదనపు క్యాలరీలను బర్న్ చేస్తుంది. జీలకర్రలోని గుణాలు శరీరంలోని అధిక కొవ్వును కరిగిస్తాయి. జీలకర్రలో పొటాషియం, కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో 1 స్పూన్ జీలకర్ర వేసి నానబెట్టి. ఉదయాన్నే మరిగించి ఫిల్టర్ చేయండి. అది గోరువెచ్చగా అయిన తర్వాత, నిమ్మరసం వేసి ఖాళీకడుపుతో తాగండి.

**దాల్చిన చెక్క** దాల్చిన చెక్క జీవక్రియలను యాక్టివ్ చేస్తుంది, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్కలోని గుణాలు శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రిస్తాయి, బరువు తగ్గడంలో తోడ్పడతాయి. దాల్చిన చెక్కలో విసెరల్ కొవ్వును కరిగిస్తుంది. జలుబు, అలర్జీలను నివారిస్తుంది. దాల్చిన చెక్కలోని యాంటీ-మైక్రోబయల్ లక్షణాలు మూత్రాశయ ఇన్ఫెక్షన్ల చికిత్సకు ఔషధంలా పనిచేస్తాయి.

**మెంతులు** మెంతులలో ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, విటమిన్ బి6, ప్రొటీన్, ఫైబర్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. దీనిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ముఖ్యంగా మెంతులలోని సపోనిన్లు, ఫైబర్ జీర్ణక్రియకు మేలు చేస్తాయి. మెంతులను నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని వ్యర్థాలనుతొలగిస్తాయి.

## ఉదయాన్నే మీ చేతులు గట్టిగా మారి నొప్పి ఉంటోందా..



వయసు పెరిగే కొద్దీ వచ్చే సమస్యలో ఆస్టియో ఆర్థరైటిస్ కూడా ఒకటి. మహిళల్లో ఎక్కువగా ఈ సమస్య ఉంది. దీనికి కారణాలు స్పష్టంగా తెలియదు. అయితే, ఎక్కువ బరువు కారణంగా ఈ సమస్య వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎంత బరువు ఉంటే అంతే ప్రమాదం ఉంటుంది. పెరిగిన బరువు కాళ్ళపై ఒత్తిడిని పెంచి సమస్యని తీవ్రంగా మారుస్తుంది. అదే విధంగా కొవ్వు కణజాలం, మీ కీళ్ళలో, చుట్టుపక్కల హానికరమైన మంటను కలిగించే ప్రొటీన్స్‌ని ఉత్పత్తి చేస్తుంది.

**కొన్ని కారణాలు..** దెబ్బలు తగలడం, ఆటలు ఆడడం, ప్రమాదంలో తగిలిన దెబ్బలు ఇవన్నీ కూడా ఆస్టియో ఆర్థరైటిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. కొంతమందికి ఉద్యోగ రీత్యా సమస్య వస్తే.. మరికొంతమందికి కుటుంబంలో ఎవరికైనా ఉంటే సమస్య వస్తుంది. ఇది రోజులు గడిచే కొద్దీ తీవ్రమై కీళ్ళనొప్పులు, కీళ్ళు, మోకాళ్ళు దృఢంగా మారి రోజువారీ పనులని కష్టంగా చేస్తుంది.

WHO ప్రకారం.. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రపంచ వ్యాప్తంగా 60 ఏళ్ళు పైబడిన స్త్రీ, పురుషులిద్దరూ ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. ఇది సాధారణ సమస్య. ఎక్కువగా చేతులు, మోకాళ్ళపై ఎఫెక్ట్ చూపించే ఈ సమస్యని తగ్గించుకునేందుకు కొన్ని లక్షణాల గురించి తెలుసుకుని ట్రీట్‌మెంట్ తీసుకోవాలని మాయో క్లినిక్ చెబుతోంది.

**సమస్య ఉంటే..** ఆస్టియో ఆర్థరైటిస్, డీజెనరేటివ్ జాయింట్ డిసీజ్, వేర్ అండ్ టియర్ ఆర్థరైటిస్ అని కూడా అంటారు. ఇది ఎముకల చివర్లో కీలులోని మృదులాస్థి క్షీణించడం వల్ల వస్తుంది. రోజులు మారే కొద్దీ సమస్య పెరుగుతుంది. మాయో క్లినిక్ ప్రకారం చేతులు, మోకాలు, వెన్నెముకలోని కీళ్ళు ఇబ్బంది పెడతాయి.

ఆస్టియో ఆర్థరైటిస్ ఉంటే ఉదయం స్టిఫ్‌గా మారతాయి జాయింట్స్. ఆస్టియో ఆర్థరైటిస్ కారణంగా నొప్పి, స్టిఫ్‌నెస్, వాపు, చేతుల్లో కీళ్ళ సున్నితత్వం ఉంటుంది. ఈ సమస్య ఉన్నప్పుడు చేతి నొప్పి ఎక్కువగా ఉండడం, కొన్ని సార్లు స్పర్శ లేకపోవడం ఉంటుంది. దీని వల్ల వేళ్ళు వంగిపోవడం జరుగుతుంది. ఆస్టియోఫైట్స్ అని కూడా పిలిచే ఈ సమస్య కీళ్ళలో ఈ పరిస్థితి అదనపు ఎముకలు పెరిగేలా చేస్తుంది.

**ఆస్టియో ఆర్థరైటిస్ లక్షణాలు..** ఈ సమస్య లక్షణాలు ఒక్కసారిగా కనిపించవు. రోజులు మారే కొద్దీ పెరుగుతాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

కీళ్ళలో నొప్పి, దృఢత్వం, సున్నితత్వం, పట్టు కోల్పోవడం, మంటగా అనిపించడం, వాపు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..** కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి కొద్దిగా రిలీఫ్ పొందొచ్చు. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం.

యాక్టివ్‌గా ఉండడం, సరైన బరువు, కొన్ని ట్రీట్‌మెంట్స్ తీసుకోవడం, వర్కౌట్స్..

అయితే వర్కౌట్స్‌లో కొన్ని హెల్ప్ చేస్తాయి.

**వర్కౌట్స్..** ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడే వారు హ్యాండ్ వర్కౌట్స్ చేయడం వల్ల నొప్పి తగ్గుతుంది. పిడికిలి బిగించడం వల్ల కీళ్ళ కదలికలు మెరుగ్గా ఉంటాయి. మీ వేళ్ళను స్ట్రెయిట్‌గా పెట్టి పిడికిలి బిగుస్తుండండి. మీ బొటనవేలు చేతి లోపల ఉండాలి. ఇది గట్టిగా చేయకుండా నెమ్మదిగా చేయండి. మళ్ళీ యథస్థానానికి రండి. దీంతో పాటు ఫింగర్ లిఫ్ట్ కూడా ట్రై చేయొచ్చు.ఎలా చేయాలంటే మీ అరచేతిని టేబుల్‌పై బోర్లా పట్టండి. నెమ్మదిగా పైకి లేపి వేళ్లని మడిచి తెరుస్తూ ఉండండి. మళ్ళీ యథాస్థానానికి రండి.

**ఎవరికి వస్తుందంటే..** యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం ఎవరికి వస్తుందో చూద్దాం.

వృద్ధాప్యం, ఊబకాయం 50 ఏళ్ళు పైబడడం, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారికి కుటుంబంలో ఆల్రెడీ ఈ సమస్య ఉన్నవారికి కీళ్ళ గాయాలు అయినవారికి ఈ సమస్య ఎక్కువగా వస్తుంది.

ఈ సమస్య వచ్చాక కాలక్రమేణా పెరుగుతుంది. గమనించకుండా వదిలేస్తే రోజువారీ పనులు కష్టంగా ఉంటాయి.

**ట్రీట్‌మెంట్..** సమస్య లక్షణాలు ఎక్కువగా ఉండి ఇబ్బంది పెడుతుంటే డాక్టర్‌ని సంప్రదించాలి. మిమ్మల్ని పరీక్షించిన డాక్టర్స్ సమస్య ఎంతలా ఉందో చూసి నొప్పుల ప్రభావాన్ని బట్టి మీకు మంచి ట్రీట్‌మెంట్‌ని సజెస్ట్ చేస్తారు. దీంతో పాటు హెల్దీ లైఫ్‌స్టైల్ చాలా ముఖ్యమని గుర్తుపెట్టుకోండి.

## రక్తంలో చక్కెర స్థాయిలను పెంచకుండా, డయాబెటిస్ రాకుండా నియంత్రించగలిగే మార్గాలు




ఇప్పుడు మన రోజువారీ జీవితంలో మధుమేహం అనే పదం సర్వసాధారణంగా మారింది. ఎందుకంటే మధుమేహం ఇప్పుడు సైలెంట్ కిల్లర్‌గా తయారైంది. ప్రతి ఐదుమందిలో ఒకరు మధుమేహ వ్యాధిగ్రస్తునిగా చూస్తారు. ఇది గణాంకాల ద్వారా ధృవీకరించబడింది. మధుమేహం అనేది జీవక్రియకు సంబంధించిన వ్యాధి అని మనకు ఇప్పటికే తెలుసు. దీనికి కారణం శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు లేదా ఇన్సులిన్‌ను తిరస్కరిస్తుంది. ఫలితంగా, రక్తంలో చక్కెర స్థాయి అసాధారణ స్థాయిలో పెరుగుతుంది.రక్తంలో చక్కెర స్థాయి చాలా పెరిగినప్పుడు, అలసట, తరచుగా మూత్రవిసర్జన, రోగనిరోధక శక్తి తగ్గడం మరియు గాయం మానడం ఆలస్యం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మధుమేహం గురించిన అత్యంత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఒకసారి నిర్ధారణ అయిన తర్వాత, వ్యాధి పూర్తిగా నయం కాదు. అయినప్పటికీ, దాని లక్షణాలను తగ్గించవచ్చు మరియు నియంత్రించవచ్చు. కానీ కొన్ని నిరూపితమైన మార్గాలు ఉన్నాయి, వీటిని క్రమం తప్పకుండా అనుసరిస్తే, మీ జీవితంలో మీకు మధుమేహం రాకపోవచ్చు. మీకు మధుమేహం యొక్క కుటుంబ చరిత్ర ఉంటే తప్ప. మరి మధుమేహం మీ ధరి చేరకూడదనుకుంటే మీ నిత్యజీవితంలో తప్పనిసరిగా పాటించాల్సినవి కొన్ని ఉన్నాయి.

1. **ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం** : శరీర బరువును ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచుకోవడం ద్వారా మధుమేహం మాత్రమే కాకుండా ఇతర రకాల వ్యాధుల నుండి కూడా విముక్తి పొందవచ్చు. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదాన్ని 70 శాతం తగ్గించుకోవచ్చు.

2. **ఫైబర్ ఫుడ్స్ తినండి** : ప్రతిరోజూ కనీసం ఒక గిన్నె సలాడ్ తినండి. ఇందులో క్యారెట్, దోసకాయ, పాలకూర, టొమాటో, ఉల్లిపాయలు, వెల్లుల్లి మొదలైన వాటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ సలాడ్‌ని ప్రతిరోజూ భోజనం లేదా రాత్రి భోజనానికి ముందు తినండి. మీరు సలాడ్‌కు ఒక టీస్పూన్ వెనిగర్ కూడా జోడించవచ్చు. వెనిగర్ రక్తంలో తక్కువ చక్కెరను గ్రహించడంలో సహాయపడుతుంది. మరియు రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటే, మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది.

3. **నడకను పెంచండి** : మధుమేహాన్ని నివారించడంలో సహాయపడే ఉత్తమ వ్యాయామాలలో నడక ఒకటి. ప్రతిరోజూ కనీసం 40 నిమిషాలు నడవడం వల్ల మీ జీవక్రియ రేటు మీ ఇన్సులిన్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడానికి సరిపోయే స్థాయిలో ఉంచుతుంది. ఫలితంగా మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది.

4. **ధాన్యం ఆధారిత ఆహారం తీసుకోండి** : వోట్మీల్, బార్లీ, బ్రౌన్ రైస్, మొక్కజొన్న, మిల్లెట్ మొదలైన తృణధాన్యాలతో అల్పాహారం తినండి. హోల్ గ్రెయిన్ ఫుడ్స్‌లో ఫైబర్ ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫలితంగా మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా, తృణధాన్యాల ఆహారం మలబద్ధకం, అధిక రక్తపోటు మొదలైన వ్యాధుల నుండి కూడా కాపాడుతుంది.

5. **కాఫీ తాగండి** : రోజుకు కనీసం రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ రిస్క్ 29% తగ్గుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే చక్కెర లేకుండా కాఫీ తాగాలి. కాఫీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఇలా చేస్తాయి.

6. **ఫాస్ట్ ఫుడ్ మానుకోండి** : ప్రస్తుతం అనేక రకాల ఫాస్ట్ ఫుడ్స్ అందుబాటులో ఉన్నాయి. అత్యాశను నిర్వహించడం అసాధ్యం కావచ్చు అని చూస్తున్నారు. కానీ ఫ్రైస్, పిజ్జా, బర్గర్స్ వంటి ఫాస్ట్ మరియు ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, జీర్ణ సమస్యలు మరియు గుండె జబ్బులు వస్తాయి. ఈ ఆహారాలు శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. ఇది మధుమేహానికి దారి తీస్తుంది.

7. **దాల్చిన చెక్క తినండి** : దాల్చిన చెక్క నూనె లేదా పొడిని రెగ్యులర్ డైట్ రూపంలో తీసుకుంటే డయాబెటిస్ రిస్క్ 48% తగ్గుతుంది! అనారోగ్యకరమైన కొలెస్ట్రాల్ మరియు ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించే సహజ సామర్థ్యం దాల్చినచెక్కకు ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. మరియు ఈ రెండు మూలకాలను సహజంగా తగ్గించగలిగితే, రక్తంలో చక్కెర స్థాయి కూడా నియంత్రణలోకి వస్తుంది. మరియు మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది.

8. **ఒత్తిడి లేకుండా ఉండటానికి ప్రయత్నించండి** : తలనొప్పి నుండి క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల వరకు కూడా అధిక ఒత్తిడికి కారణం కావచ్చు. కాబట్టి మీరు తరచుగా చాలా ఒత్తిడికి లోనవుతున్న వారైతే, వివిధ సడలింపు పద్ధతులు మరియు యోగా వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించు కోండి. ఇది మీ శరీరంలోని కార్టిసాల్ హార్మోన్ స్థాయిని కూడా నియం త్రిస్తుంది మరియు మధుమేహం ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

9. **ధూమపానం వదిలేయండి**: ఒత్తిడి వలె, ధూమపానం అనేక తీవ్రమైన వ్యాధులకు మరొక కారణం. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పాటు మధుమేహం వంటి వ్యాధులకు ధూమపానం ఒకటి. కాబట్టి మీకు మధుమేహం రాకూడదనుకుంటే ఈరోజే ధూమపానం మానేయండి.

10. **నీళ్లు బాగా తాగండి.** ఇతర పానీయాలకు బదులుగా రోజులో మీరు తగినంత నీటిని తాగడం వల్ల రక్తంలో చక్కెర మరియు ఇన్సులిన్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడవచ్చు, తద్వారా మధుమేహం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎక్కువ సమయం నీటితో అతుక్కోవడం వల్ల చక్కెర, ప్రిజర్వేటివ్‌లు మరియు ఇతర అనవసరమైన పదార్థాలు ఎక్కువగా ఉండే పానీయాలను నివారించడంలో మీకు సహాయపడుతుంది.

## ప్రతి 15 రోజులకోసారి ఎందుకు ఫేషియల్ చేయించుకోవాలి



ప్రతి కొన్ని రోజులకొకసారి చర్మం లోతుగా శుభ్రపరచబడాలనడంలో సందేహం లేదు. దీనితో పాటు పోషకాహారం కూడా చాలా ముఖ్యం. ఫేషియల్ ఈ రెండు అవసరాలను చాలా చక్కగా తీరుస్తుంది. ఈ కారణంగానే మీరు ఏ స్కిన్ స్పెషలిస్ట్ వద్దకు వెళ్లినా ఫేషియల్ చేయించుకోమని ఖచ్చితంగా అడుగుతారు. సాధారణంగా మహిళలు నెలకు ఒకసారి లేదా రెండు నెలలకు ఒకసారి చేస్తారు. అయితే నెలకు రెండుసార్లు అంటే 15 రోజులకు ఒకసారి ఫేషియల్ చేసుకుంటే చర్మానికి మేలు జరుగుతుందని మీకు తెలుసా

**15 రోజులకొకసారి ఫేషియల్ ఎందుకు చేసుకోవాలి?** 15 రోజులకు ఒకసారి ఫేషియల్ చేయించుకోవడం వల్ల చర్మం శుభ్రపడుతుంది. ఇది దుమ్ము, ధూళి, జిడ్డు నుండి చర్మ రంధ్రాలను శుభ్రపరుస్తుంది మరియు చర్మంలో మృత కణాలను తొలగిస్తుంది. అలాగే చర్మాన్ని అందవిహీనంగా మార్చే బ్లాక్ హెడ్స్ నుండి వైట్ హెడ్స్, మొటిమలతో ఏర్పడిన మచ్చలను తొలగిస్తుంది. ఇలా చర్మానికి హాని కలిగించే వ్యర్థాలను నెలకు రెండుసార్లు తొలగిస్తే, చర్మం మరింత ఆరోగ్యంగా మరియు మెరుస్తూ ఉంటుంది.

**ఫేషియల్ గురించి నిపుణులు ఏమంటున్నారు?** డెర్మటాలజిస్ట్ రష్మీ శెట్టి మాట్లాడుతూ.. నెలకు ఎన్నిసార్లు ఫేషియల్ చేయించుకోవాలనే విషయంలో ఎలాంటి రూల్ లేదు. మీకు పొడి చర్మం ఉన్నట్లయితే, నెలకు రెండుసార్లు ఫేషియల్ చేయించుకోవడం వల్ల మీ చర్మాన్ని తేమగా మరియు మీ ముఖం అందంగా, కాంతివంతంగా ఉంచుతుందని ఆమె చెబుతున్నారు. పొడి చర్మం ఉన్న వ్యక్తులు మూసుకుపోయిన చర్మ రంధ్రాలు లేదా వైట్ హెడ్స్ మరియు బ్లాక్ హెడ్స్ కలిగి ఉంటారు. అందుకోసం 15 రోజులకు ఒకసారి చర్మాన్ని శుభ్రం చేసుకోవచ్చని వైద్యులు తెలిపారు. అయితే సెన్సిటివ్ స్కిన్ ఉన్నవారు ఫేషియల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అలాంటి చర్మం త్వరగా చికాకు పడుతుంది, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ రష్మీ సూచిస్తున్నారు.

**ఫేషియల్ ఎలా పనిచేస్తుంది** ఫేషియల్ అనేది స్కిన్ కేర్ ట్రీట్‌మెంట్, ఇది ఒక గంట నుండి గంటన్నరలోపు ప్రయోజనాలను పెంచడానికి ఉత్పత్తులు మరియు పద్ధతుల కలయికను ఉపయోగించాలి. ఇందులో ఎక్స్‌ఫోలియేషన్ ద్వారా డెడ్ స్కిన్ మరియు మలినాలను తొలగిస్తారు. దీనితో పాటు, సాఫ్ట్ గా ఉండే ఫేస్ ప్యాక్ లు మరియు క్రీములు చర్మానికి ఓదార్పు మరియు హైడ్రేషన్ ఇవ్వబడుతుంది. అలాగే, చేతితో సున్నితంగా మసాజ్ చేయడం వల్ల వృద్ధాప్య సంకేతాలను తగ్గించడానికి మరియు ముఖం యొక్క ఆకృతిని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**ఫేషియల్ ఎలా చేసుకోవాలి?**

స్టెప్ 1: ముఖం క్లెన్సర్‌తో శుభ్రం చేయబడుతుంది.

స్టెప్ 2: చర్మం స్క్రబ్ ఉపయోగించి ఎక్స్‌ఫోలియేట్ చేయబడుతుంది.

స్టెప్ 3: చర్మంలో వ్యర్థాలను తొలగించడానికి ఒక ఫేస్ మాస్క్ ఉపయోగపడుతుంది. ఇది సుమారు 10 నుండి 15 నిమిషాలు ఉంచబడుతుంది.

స్టెప్ 4: ఫేషియల్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన క్రీమ్‌లతో మసాజ్ చేస్తారు. ఈ సమయంలో, మసాజ్ పద్ధతులను ఉపయోగించి చర్మాన్ని సడలించడం మరియు ముఖాన్ని ఆకృతి చేయడంపై దృష్టి కేంద్రీకరించబడుతుంది. ఇది సుమారు 20 నిమిషాల నుండి అరగంట వరకు జరుగుతుంది.

స్టెప్ 5: ముఖాన్ని శుభ్రపరిచిన తర్వాత, ఫేస్ ప్యాక్ అప్లై చేయాలి. ఇది దాదాపు 15 నుండి 20 నిమిషాల వరకు ఉంటుంది.

స్టెప్ 6: ముఖాన్ని మళ్లీ శుభ్రం చేసుకున్న తర్వాత, ఫేస్ క్రీమ్ మరియు సన్‌స్క్రీన్ అప్లై చేయాలి.

**ఇంట్లో ఫేషియల్ ఎలా చేయాలి :**

స్టెప్ 1: సున్నితమైన ఫేస్ వాష్‌తో మీ ముఖాన్ని శుభ్రం చేసుకోండి.

స్టెప్ 2: ఇంట్లో తయారు చేసిన లేదా మార్కెట్‌లో కొనుగోలు చేసిన స్క్రబ్‌తో మీ ముఖాన్ని కనీసం 5 నిమిషాల పాటు స్క్రబ్ చేయండి.

స్టెప్ 3: ముఖం మీద ఆవిరిని తీసుకోండి, దీని తర్వాత ఏవైనా ఉత్పత్తులు వర్తించబడతాయి, అవి బాగా గ్రహించబడతాయి.

స్టెప్ 4: రిచ్ మాయిశ్చరైజర్‌తో మీ ముఖాన్ని 10 నిమిషాల పాటు మసాజ్ చేయండి. ఈ సమయంలో, స్ట్రోక్‌లను ఎలా ఉంచుకోవాలో మీరు ఇంటర్నెట్‌లో వీడియోల సహాయం తీసుకోవచ్చు.

స్టెప్ 5: ముఖాన్ని శుభ్రపరిచిన తర్వాత, ఇంట్లో తయారుచేసిన లేదా మార్కెట్ నుండి తెచ్చిన ఫేస్ ప్యాక్‌ను అప్లై చేయండి. 15 నిమిషాలు అలాగే ఉంచండి.

స్టెప్ 6: గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసి, ఆపై క్రీమ్ రాయండి.

మీకు అవసరం అనుకుంటే: మీకు కావాలంటే, మీరు బాదం నూనె లేదా చర్మానికి సరిపోయే ఏదైనా ముఖ్యమైన నూనెను కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

## మాజీ సీఎం జగన్ ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన దీక్ష



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతున్న దాడులు, హింసాత్మక ఘటనలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర నిరసన దీక్ష చేపట్టారు. ఏపీలో అరాచక పాలన సాగుతోందంటూ వీడియోలు, ఫోటోలు ప్రదర్శించారు.మరోవైపు ఈ ధర్నాకు పలు పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. వివిధ పార్టీల నేతలు ధర్నాకు హాజరై వైఎస్ జగన్‌కు మద్దతు పలికారు.

## అభయాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం



విజయనగరం, (విశాఖ సమాచారమ్): ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామ నారాయణం ప్రాంగణంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు,విశేష పూజలు చేశారు. ఈ ఉత్సవంలో ఎన్సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ,నీరజవల్లి ,తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు నెం. SANDT_CAMC_24_EI_GE_02stn

పని పేరు: వాల్తేరు డివిజన్‌లో 02 స్టేషన్ల వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్స్ (GE తయారీ) కొరకు 02 (రెండు) సంవత్సరాల కాలంనకు సమగ్ర వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్. ప్రదేశములు: (1) శివలింగపురం, (2) తైడా.

ప్రకటిత విలువ: ₹ 16,78,284.00, బయానా: ₹ 33,600/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 3,540/-, పూర్తి చేయు కాలం: 24 నెలలు.

బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 26.07.2024

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 09.08.2024న 1700 గంటలకు

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఎవైన అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్ www.ireps.gov.in

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు

PR-347/P/24-25


## ప్రభుత్వ హాస్టల్స్ సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈ నెల 20వ తారీకు నుండి 30 వ తారీకు వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవాలని జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ హాస్టల్ లు సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి యొక్క సమస్యలు తెలుసుకోవడం జరుగుతుంది. అందులో భాగంగానే విశాఖపట్నంలో ఉన్నటువంటి ప్రభుత్వ హాస్టల్స్ ను సందర్శించే క్రమంలో ఈరోజు చిన్న గదిలి ఎస్సీ బాలుర కాలేజ్ హాస్టల్స్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడడం వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి వండిన భోజనం సక్రమంగా ఉందా లేదా అని వారితో కలిసి భోజనం చేయడం జరిగింది. అనంతరం రాత్రి అక్కడే విద్యార్థితో కలిసి బస చేశారు.అలాగే హాస్టల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారానికి ఆగస్టు 6 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్నటువంటి శాంతియుత ధర్నా కార్యక్రమంలో విద్యార్థులందరూ అధిక సంఖ్యలో పాల్గొవాలని విద్యార్థులకు పిలుపునివ్వడం జరిగింది.

## ప్రాణాలు పోతున్నా వీడని కర్తవ్యం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మల్కాపురం పారిశ్రామిక వాడలో పెద్ద ప్రమాదం తప్పింది. 300 గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వాహన డ్రైవర్కు గుండెనొప్పి రావడంతో సమయ స్ఫూర్తితో వ్యవహరించి, లారీని పక్కన నిలిపి కేబిన్లోనే ప్రాణాలు విడిచాడు....

ఈ ఘటన మారుతి జంక్షన్లో జరిగింది. గాజువాక ఆటోనగర్ ప్రాంతానికి చెందిన నరవ శ్రీనివాసరావు (50) బుధవారం ఉదయం ఎనిమిది గంట లకు గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రంలో విధులకు హాజరయ్యాడు...

లారీలో 300 సిలిండ ర్లను లోడ్ చేసుకుని వీడీఆర్ గొడౌన్ మీదుగా మల్కాపురం వైపు వెళ్తున్నారు. మారుతి జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ఆయనకు గుండెపోటు వచ్చింది.

అంత బాధలోనూ వాహనం అతి కష్టంపై డివైడర్పైకి చేర్చి స్టీరింగ్ మీద వాలి పోయారు.

అటుగా వెళ్తున్నవారు గమనించి డ్రైవర్ను బయటకు తీసి.. 108 వాహనానికి ఫోన్చేసి, మల్కాపురం పోలీసులకు సమాచార మిచ్చారు.

ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది డ్రైవర్ శ్రీనివాస్ను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్కు తరలించారు...

అక్కడికి సమీపంలోనే హెచ్పీ పెట్రో పార్కు కంపెనీ బీపీసీఎల్, ఈపీఎల్ తదితర ఆయిల్ పరిశ్రమలు, రసాయనాలతో ఉన్న గొడౌన్‌లున్నాయి. వాహనం బోల్తాపడి గ్యాస్ సిలిండర్లు పేలిపోతే పెను ప్రమాదమే జరిగేది.

## "స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్" అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చిన డా॥విశాల్




విజయవాడ, (పీఐబీ): ఆదాయపు పన్ను కార్యాలయం, ఎస్వీఆర్ ప్లాజా, విజయవాడలో ఆదాయపు పన్ను శాఖ విజయవాడ 165వ ఆదాయపు పన్ను దినోత్సవాన్ని 24 జూలై, 2024న జరుపుకుంది. అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారమైన "ది ఛైర్మన్ స్పీక్స్" ప్రీ-రికార్డ్ సంవాద్ సెషన్‌లో ఛైర్మన్, సిబిడిటి రవి అగర్వాల్ అభినందన సందేశం ప్రసారం చేయడంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. తర్వాత పన్ను చెల్లింపుదారులు మరియు వాటాదారులను అభినందిస్తూ ఒక షార్ట్ మూవీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆదాయపు పన్ను శాఖ పిఆర్.కమీషనర్ శ్రీమతి సునీత బిల్లా అధికారులు మరియు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఆదాయపు పన్ను పాత్ర గురించి, భారత దేశంలో ఆదాయపు పన్ను పరిణామాన్ని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా డా. విశాల్ ఇండ్ల, ఎండి, డిఎన్‌బి (సైకియాట్రీ) గౌరవ అతిథిగా విచ్చేసి "స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్" అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. ఇంకా కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ సాకా నరేష్, అదనపు ఆదాయపు పన్ను డైరెక్టర్ (ఇన్‌వి) వినోద్ కన్నన్, ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ సంధ్యా రాణి, ఆదాయపు పన్ను (టిడిఎస్) జా. కమీషనర్ నెడుమారన్, జాయింట్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అభినయ మరియు ఇతర అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## ఒకేసారి మూడు సంక్లిష్ట న్యూరో వాస్క్యులర్ సమస్యలకు విజయవంతంగా చికిత్స



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలికి మెదడులో రక్తనాళాల ఎన్యూరిజం పగలడం, కారోటికో-కావెర్నస్ ఫిస్టులా (సీసీఎఫ్)తో పాటు రక్తనాళాల్లో పూడిక కూడా ఏర్పడింది. ఈ సంక్లిష్టమైన కేసుకు విశాఖ పట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు ఒకే సెషన్‌లో చికిత్స చేసి నయం చేశారు. ఆస్పత్రిలో నిపుణులైన ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్ పోతుల నేతృత్వంలోని వైద్య బృందం ఈ ఘనత సాధించింది.

ఈ రోగిని తొలుత తీవ్ర తలనొప్పి, ఎడమ కంటి కనుపాపలు వాలి పడిపోతుండటం, స్పృహ కోల్పోవడం, వాంతులు కావడం లాంటి సమస్యలతో తొలుత ఆస్పత్రిలో చేర్పించారు. ఎంఆర్ఐ స్కాన్‌లో ఆమె మెదడు రక్తనాళాల్లో ఎన్యూరిజం పగిలి పోయినట్లు తేలడంతో ఆసుపత్రిలో చేరిన వెంటనే ఆమెకు స్ట్రోక్ రావడంతో కుడి కాలు కదపలేని పరిస్థితి ఏర్పడింది. అనంతరం మరికొన్ని పరీక్షలు, యాంజియోగ్రామ్ చేసి.. మెదడు రక్త నాళంలో పూడికను గుర్తించారు.

డాక్టర్ వెంకటేష్ పోతుల, ఆయన బృందం రక్తనాళం పూడికకు మెకాని కల్ థ్రాంబెక్టమీ, పగలిపోయిన ఎన్యూరిజంకు ఫ్లో డైవర్టర్ ప్లేస్‌మెంట్ ఒకేసారి నిర్వహించారు. పగిలిపోయిన ఎన్యూరిజం, రక్తనాళాల్లో పూడిక రెండింటికీ ఒకేసారి చికిత్స చేశారు. ఈ సమగ్ర విధానం వల్ల మొత్తం మూడు సమస్యలూ ఒకేసారి పరిష్కారం అయ్యాయి. చికిత్స విజయవంతం కావడంతో రోగికి ఎలాంటి సమస్యలు లేకుండా తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నారు.

ఇంటర్వేషనల్ రేడియాలజీ ప్రొసీజర్లతో తగిన సమయానికి చికిత్స చేయడం ఎంత ముఖ్యమన్న విషయాన్ని డాక్టర్ వెంకటేష్ పోతుల వివరించారు. "ఇలాంటి సమస్యలు ఏ సమయం లోనైనా రావచ్చు. లక్షణాలు కనిపించ గానే సరైన ఆస్పత్రిలో సరైన వైద్యుడికి చూపించుకోవడం చాలా ముఖ్యం. సరైన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్స వల్ల కోలుకునే సమయం గణనీయంగా తగ్గుతుంది. ఏమాత్రం ఆలస్యమైనా ఇతర సమస్యలతో పాటు మరణం కూడా సంభవించవచ్చు. అందువల్ల ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తగిన వైద్యసాయం పొందాలి" అని ఆయన తెలిపారు.

మెదడులో రక్తనాళాలు పగలడం, వాటిలో పూడికలు రావడం వల్ల తలెత్తే లక్షణాల విషయంలో తగిన అవగాహనతో వెంటనే స్పందించాల్సిన అవసరాన్ని ఈ కేసు మరింత స్పష్టంగా చెబుతుంది. వేగంగా స్పందించి, వెంటనే సమర్థమైన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్సలు అందిస్తే రోగి ప్రాణాలను కాపాడవచ్చు.

## మృతుల కుటుంబాలకు కంచర్ల ఆర్థిక సాయం



ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): విశాఖ పట్నం తూర్పు నియోజక వర్గం పరిధి ఆరిలోవ దుర్గానగర్ చెరువు నీటిలో ప్రమాదవశాత్తు జారిపడి ఇద్దరు యువకులు చనిపోవడం జరిగింది. వీరి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, టీడీపీ నాయకుడు కంచర్ల అచ్యుతరావు వెంటనే స్పందించి వారి కుటుంబ అవసరాల నిమిత్తం 20,000 రూపాయలు ధనసాయం చేశారు. భవిష్యత్ లో వాళ్ళకి ఏ అవసరం వచ్చిన ఉపకార్ ట్రస్ట్ తరుపున చేస్తాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం సహాయం ఎందుకు అవసరం అంటే ? పార్లమెంట్ లో విశాఖ ఎమ్.పి. శ్రీభరత్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక కేటాయింపులు చేయడం ఎందుకు అనివార్యమై తెలియజేస్తూ విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ చేసిన ప్రసంగం సర్వత్రా ప్రశంసలు అందుకుంది. చంద్రబాబునాయుడు సమర్థ ముఖ్య మంత్రిగా విపత్కర పరిస్థితులలో 1995, 2014 సంవత్సరాలలో రాష్ట్రాన్ని నడిపించిన పరిస్థితికి ప్రస్తుత 2024 లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టినప్పటికి రాష్ట్రం స్థితికి భిన్నమైన వాతావరణం ఉందని శ్రీభరత్ వెల్లడించారు. నేడు ఆంధ్రప్రదేశ్ లక్షల కోట్ల అప్పుల ఊబిలో చిక్కుకుని కేంద్రం సహాయం లేనిదే మనుగడ సాగించలేని స్థితిలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు భయపడి బడ్జెట్ సమావేశాలను వాయిదా వేసుకున్నామని, విద్యుత్తు సహ వివిధ రంగాలలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్ల ఆంధ్రప్రదేశ్ కు కోలు కోలేనంత దెబ్బతగిలిందని, ప్రభుత్వం శాఖల వారీగా సమీక్షించి శ్వేత పత్రం విడుదల చేస్తోందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ను సంక్షోభం నుంచి బయటకు తేవడంలో భాగంగానే తెలుగుదేశం, జనసేన, బి.జె.పి. కలసి పోటీ చేశాయని శ్రీభరత్ స్పష్టం చేశారు. విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని రెవెన్యూ పంపిణీ సరిగా జరగలేదన్నారు.

విభజన అనంతరం 2014లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతిని నిర్మించాలని చంద్రబాబు అందుకు 30 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని అందించారని తెలిపారు. ఐతే గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గత ఐదేళ్ళలో ఆంధ్రప్రదేశ్ కు రాజధాని అంటూ లేకుండా పోయిందన్నారు. అలాగే పోలవరం నిర్మాణం పూర్తికాలేదని వివరించారు. కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలతో పాటు, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించిందని, వాటితో పూర్తి చేస్తామని ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన రాష్ట్ర ప్రజల ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. పోలవరం పూర్తి చేయడం దేశంలోని వ్యవసాయ రంగానికి ముఖ్యమైనదని ఆర్థిక మంత్రి ప్రకటించడం ఆహ్వానించతగ్గ పరిణామమన్నారు.

**ఆ జాబితాలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను చేర్చండి**

200 సంస్థల ప్రైవేటీకరణ ను వెనక్కు తీసుకుంటాం అని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఆ జాబితాలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను కూడా జత చేయాలి అని విశాఖ ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది అని, అందుకు కావాల్సిన మార్గదర్శకాలను కేంద్రం అందజేయాలి ఆయన కోరారు.అంతే కాకుండా రైల్వే జోన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి అని ఆయన కోరారు.

**దేశ ప్రగతికి దోహదపడే విధంగా బడ్జెట్ కేటాయింపులు**

2027 సంవత్సరం నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ను తీర్చి దిద్దడం లక్ష్యంగా ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి బడ్జెట్ లో కేటాయింపులు చేశారని శ్రీభరత్ ప్రశంసించారు. రాష్ట్రాలు బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందనేది ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు.వికసిత్ భారత్ లక్ష్యం తో రూపొందించిన బడ్జెట్ రానున్న రోజుల్లో ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జిల్లాల వారీగా యువతలో నైపుణ్యాలపై నివేధిక తయారు చేస్తున్నామని కేంద్ర బడ్జెట్ లో నైపుణ్యాభివృద్ధికి కేటాయించిన నిధులు ఉపయోగించుకునేలా పరిశ్రమలతో అను సంధానం చేస్తామన్నారు. కృత్రిమ మేధ ప్రభావంతో యువత ఉపాధి దెబ్బతినకుండా శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సధుపాయాల మెరుగుకు, వెనక బడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖ లో పట్టణ పారిశుధ్యం ప్రధాన సమస్య అని దేశంలో పట్టణ పారిశుద్య నిర్వహణకు నిధులు కేటాయించడం స్థానికంగా వసతుల మెరు గుకు ఉపకరిస్తుందన్నారు.

కూటమి ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుం దన్న విపక్షాల విమర్శలు అర్థ రహితం అని శ్రీభరత్ పేర్కొన్నారు. ఎదుటి వారిని వేలెత్తి చూపితే నాలుగు వేళ్ళు మనవైపు చూపుతున్న విషయం మరవ కూడదని తెలిపారు. ఇండియా కూటమి కంటే ఎన్డిఎ కూటమి ఎన్నో రెట్లు బలమైనదని, దేశ ప్రయోజనాలు లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.

## విశాఖ నగర మేయర్ కు అవమానం



ఏపీలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణమైన స్థితికి చేరు కున్నాయని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆరోపిస్తూ జగన్ నేతృత్వంలో వైసీపీ నేతలు బుధవారం ఢిల్లీలో నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే విశాఖ నగర్ మేయర్ కు ఘోర అవమానం కలిగింది.ధర్నా కార్యక్రమంలో భాగంగా వైకాపా పెద్దలు ఆమెకు కనీస గౌరవం ఇవ్వకుండా కూర్చోవడానికి కుర్చీ ఇవ్వకపోవడం విశాఖ నగర ప్రజలకు తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఏలూరులో ఫుడ్ ఇన్స్పెక్టర్ అవతారం ఎత్తిన నలుగురు నకిలీ విలేకరుల ముఠా అరెస్ట్

ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ వ్యాపారస్తుల్ని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో నలుగురు వ్యక్తులు కలిగిన ముఠాను ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏలూరు డి.ఎస్.పి శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. ఏలూరు నగరపాలక సంస్థ 19వ డివిజన్ కొత్తూరు ఇందిరమ్మ కాలనీ చెందిన మండల అప్పలనాయుడు చిన్న హోటల్ ను నడుపుతున్నాడు. ఇటీవల కొందరు ఈజీ మనీ సంపాదనలో పడి విలేకరులు వృత్తులను ఎంచుకొని దాని ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారు. ఇందులో ప్రధాన సూత్రధారులైన మంగళ వెంకట దుర్గ ఏలూరులోని లోకల్ ఛానల్ లో విలేకరిగా పనిచేస్తుంది. ఆమె ఒక పథకం ప్రకారం ఇందిరమ్మ కాలనీలో మండల అప్పలనాయుడు హోటల్ కి వెళ్ళింది. ఆ దుకాణ యజమాని ఎక్కడ అని అడిగి హోటల్లో అన్ని పరిశీలించి తాను ఫుడ్ సేఫ్టీ అధికారిని.. హోటల్ లో ఏమి సరిగా లేవని ఆ హోటల్ యజమాని అప్పలనాయుడుని బెదిరించింది. కనీసం లైసెన్స్ లేకుండా హోటల్ ను ఎలా నడుపుతున్నారని, దీనిపై చర్యలు తీసుకుంటామని బెదిరించింది. దీనికి భయపడిన అప్పలనాయుడు వెంటనే లైసెన్స్ తీసుకుంటాను ఇకనుంచి నిబంధనలు పాటిస్తానని చెప్పాడు. అప్పటికి ఆ యజమాని మాటలు వినకుండా మరొక వ్యక్తికి ఫోన్ చేసింది. రూ 10,000 ఇస్తే విడిచిపెడతామని డిమాండ్ చేశారు. వీరి ప్రవర్తన పై అనుమానం వచ్చిన యజమానికి సీసీ కెమెరాలు దగ్గర తీసుకువెళ్లి డబ్బులు ఇస్తాను చెప్పి ఈ విషయాన్ని అందర్నీ అడగగా వాళ్ళు నకిలేని అధికారులు తెలిసింది వెంటనే ఈ విషయాన్ని జిల్లా ఎస్పీకి ఆన్లైన్ ద్వారా తెలియజేయడంతో వేలూరు పోలీస్ స్టేషన్ వచ్చేసి దర్యాప్ చేసి ప్రధాన నిందితురాలు అయిన వెంకట దుర్గా దేవి పాట సహకరించి బుక్కురి దేవి ప్రసాద్, అగ్గాల ఉమామహేశ్వరి, పులిగా రాంబాబులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు..వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్స్ రెండు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ కేస్ చేదించిన ఎస్సై రాజారెడ్డిని ఆయన అభినందించారు. ఎవరైనా అధికారులు అంటూ డబ్బులు డిమాండ్ చేస్తే తక్షణమే పోలీసులు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

**బైట్:** శ్రీనివాసులు. ఏలూరు డీఎస్పీ

కాగా ఇలాంటి అనైతిక కార్యక్రమాలు విచ్చలవిడిగా పుట్టుకొచ్చిన యూట్యూబ్ ఛానెళ్ళ పేరుతో, వాటికి న్యూస్ ప్రసారం చేసే అధికారం లేదు, అయితే ప్రభుత్వం కూడా ఇలాంటి ఛానెళ్ళు కి ఏమాత్రం గుర్తింపు లేదు. అయినప్పటికీ తామర తంపరగా పుట్టుకొస్తున్న యూట్యూబ్ ఛానెల్ల విలేకర్లమంటూ డజన్ల సంఖ్యలో ఆఖరికి మండలకేంద్రాల్లో కూడా అక్షరజ్ఞానం లేని నిరక్షర కుక్షులు జర్నలిజానికి అర్థం కూడా తెలియని వారు విచ్చల విడిగా జర్నలిస్టులుగా చలామణి అవుతుంది ఇలాంటి నీచ కార్యక్రమాలకు పాల్పడుతూ తలఒంపులు తెస్తున్నారు. వీరు చేసే హడావిడి కి అసలు సిసలు పాత్రికేయులు ఏమీ పాలుపోక కిమ్మనకుండా ఉండాల్సివస్తోందని వాపోతున్నారు. కనుక ఇలాంటి నీచకార్యక్రమాలకు, బ్లాక్ మైలింగ్కి పాల్పడేందుకు అవకాశం ఇస్తున్న యూట్యూబ్ ఛానెళ్ళ ను నిషేదించి జర్నలిజం విలువను కాపాడాలని కోరుతున్నారు.

# జెట్ స్పీడ్ గా సూపర్ సిక్స్ పథకాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కూటమి ఎన్నికల మేనిఫెస్టో లో తల్లికి వందనం పథకం గురించి ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బడికి వెళ్లే ప్రతి విద్యార్థి విద్యార్థిని లకు 15000 రూపాయలు ఇస్తామని వాగ్దానం చేసిన దానికి నేడు శాసనసభలో విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తల్లికి వందనం కార్యక్రమంలో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ 15000 రూపాయలు ఇస్తామని ప్రకటన ద్వారా తల్లులందరూ ఆనందం హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్, మాజీ పట్టణ శాఖ మహిళా అధ్యక్షురాలు కొట్ని ఉమా గురువారం ఉదయం పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. టౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాయల ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ నిన్న శాసన సభలో లోకేష్ బాబు ప్రకటనలో స్పష్టత ఉందని చదువుకున్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో గాని, ప్రైవేటు పాఠశాలల గాని ఎక్కడ చదివిన ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 15000 ఇస్తామని స్పష్టత ఇచ్చారని, దీనిలో ఎవరికీ అనుమానాలు కలగకుండా వివరంగా చెప్పారని ప్రసన్న అన్నారు. తెలుగు మహిళ పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు బీశెట్టి హేమ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకంలో 2019 ఎన్నికలకు ముందు జగన్ రెడ్డి చెప్పిన హామీలు వేరు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి తూట్లు పొడుస్తూ సంవత్సరానికో విధంగా నిబంధనలను మార్చి తల్లులకు అన్యాయం చేశారని, దీని ఫలితంగా 11 సీట్లకు పరిమిత మయ్యారని, అయినప్పటికీ జగన్ రెడ్డిలో పరివర్తన కలగలేదని అన్నారు. నేడు రాష్ట్రంలో శాసనసభ సమావేశాలకు వెళ్లకుండా ప్రజా సమస్యల గాలికి వదిలి,ఢిల్లీలో అబద్ధ ప్రచారాలతో ఇంకా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, ఇప్పటికే వైసీపీ భూస్థాపితం అయిందని, రానున్న రోజుల్లో కనుమరుగు కావడం ఖాయమని హేమ జగన్ రెడ్డి పై మండిపడ్డారు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్ కూరాకుల భారతి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకం ద్వారా మహిళలకు ఇస్తామని హామీలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా ప్రకటనలు చేయడం వల్ల మహిళల్లో ఆనందం వ్యక్తం అవుతుందని భారతి అన్నారు.

# వ్యాపార నైపుణ్యాలు పెంచుకోండి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ కోరారు. నైపుణ్యాలతో అద్భుతమైన అవకాశాలు వస్తాయని, పలువురికి ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆశా దీపాలుగా నిలవగలరని అన్నారు. పార్వతీపురం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల సంస్థ, నాబార్డు తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు., ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హత, వనరులు ఉన్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ స్వంత కాళ్ళ మీద నిలబడాలి అనేది లక్ష్యం అన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చుటకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగితే పలువురికి ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. ఒత్సాహికుల నుండి ప్రతి నెల దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఆయన సూచించారు. కోటి రూపాయలు వరకు రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఔత్సాహికులు సీతానగరం మండలం నుండి బంకూరు హేమలత మాట్లాడుతూ రుబ్బు మిషను ఉందని, దానిని విస్తరించుటకు ప్రయత్నిస్తున్నామని, రుణాలు మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన సీరపు శంకర రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకం క్రింద రుణాలు పొంది యూనిట్ నెలకొల్పి ఆరు కుటుంబాలకు ఉపాధి కల్పించామని చెప్పారు.అగ్రికల్చర్ బి.ఎస్సి చదివి తేనె తయారి పరిశ్రమను నిర్వహిస్తున్న వర్మ మాట్లాడుతూ తేనె తయారి చేస్తున్నామని, మార్కెటింగ్ కు సహకరించాలని కోరారు. డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు సాయి కుమార్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్ కుమార్ రెడ్డి, ఎస్ బి ఐ రీజనల్ మేనేజర్ బి బి సాహు, ఖాదీ పరిశ్రమల బోర్డు అభివృద్ధి అధికారి రవి కుమార్ , ఔత్సాహికులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ పాఠశాలలో డైట్ విద్యార్థుల ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఔట్రీచ్ ప్రోగ్రామ్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాల ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ( ఐ ఐ సి) మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ సంయుక్తంగా బుధవారం అనకాపల్లి జిల్లా కొప్పాక గ్రామంలోని జెడ్ .పి హైస్కూల్‌లో "ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్" అనే కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో, పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి, ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత గురించి సవివరంగా తెలియజేసారు . ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మరియు సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. భార్గవి కార్యక్రమాన్ని ప్రారంభించి, రోజువారీ జీవితంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ వివి ప్రసన్న కుమార్, విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రేరేపించారు మరియు కొత్త వినూత్న ఆలోచనలను రూపొందించడానికి వారిని ప్రోత్సహించారు.

# ప్రతి వ్యక్తినీ పరీక్షించాల్సిందే



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): ఒక గ్రామంలో జ్వరం కేసు నమోదు అయితే ఆ గ్రామంలో ప్రతి వ్యక్తినీ పరీక్షించాల్సిందే అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కడా నమోదు కాకుండా శత శాతం చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద కేసులు ఉన్నా అన్ని పరీక్షలు చేసి మంచి వైద్యాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. వైద్య అధికారులు తమ క్షేత్ర స్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సీతంపేట, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల్లో మరింత శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. జ్వరాల సర్వే నిరంతరం సాగాలని, మందులు సిద్ధంగా ఉండాలని ఆయన చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఒక్క మరణం కూడా సంభవించరాదని ఆయన అన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రస్తుత సీజన్ లో వైద్య అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది సేవలను ప్రణాళికాబద్ధంగా పక్కాగా వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. అవసరం మేరకు మైదాన ప్రాంతాల నుంచి గిరిజన ప్రాంతాలకు సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆదేశించారు. కీటకాల (వెక్టార్) ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టాలని ఆయన ఆదేశించారు. రక్త హీనత నివారణ, మాతృ శిశు మరణాలు జరగకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిల్లల నుండి పెద్దల వరకు రక్త హీనత సమస్య కనిపిస్తుందని ఆయన చెప్పారు. సామాజిక కిచెన్ గార్డెన్ ను నిర్వహించాలని, పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. గర్భిణీల నమోదులో జాప్యం జరగరాదని ఆయన అన్నారు. ప్రతి గర్భిణీని పరీక్షించాలని ఆయన అన్నారు. ఐరన్ ధాతువులు లోపం లేకుండా చూడాలని ఆయన చెప్పారు. వ్యక్తిగత శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. మాదలంగి, దుడ్డుకల్లు, మర్రిపాడు, తగితర పిహెచ్ సీ ల పరిధిలో రక్త హీనత నివారణకు మరింత కృషి చేయాలని ఆయన అన్నారు. పిహెచ్ సీ లకు గ్రేడింగ్ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఆధార్ శిబిరాలు జరుగుతున్నాయని, వాటిలో ప్రజల వివరాలు సరిదిద్దుకోవచ్చని ఆయన అన్నారు. తద్వారా ఆర్ సి హెచ్ పోర్టల్ లో నమోదులో ఇబ్బందులు లేకుండా చేయవచ్చని తెలిపారు. ప్రతి నెల మండలాల్లో రక్త దాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, వైద్య అధికారులు సమన్వయం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ పార్వతి, జిల్లా మలేరియా అధికారి వై మణి, జిల్లా ఇమ్యూనైజేశన్ అధికారి నారాయణ రావు, డిప్యూటీ డిఎంహెచ్ ఓ శివ కుమార్, ప్రోగ్రాం అధికారులు ఎం వినోద్, టి జగన్మోహన రావు, వైద్య అధికారులు, పి హెచ్ సి వైద్యులు పాల్గొన్నారు.

## ఇప్పుడున్న కౌలు రైతు చట్టం రద్దు చేస్తాం : మంత్రి అచ్చెనాయుడు



అమరావతి: గత ప్రభుత్వంలో వెబ్ ల్యాండ్ పేరుతో రైతు భరోసా ఎగ్గొట్టారని.. ప్రతి రైతు భూమిని వెబ్ ల్యాండ్‌లో పెడతామని, గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లు జరగకుండా రైతుభరోసా ఇస్తామని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడు పేర్కొన్నారు. ఇప్పుడున్న కౌలు రైతు చట్టం రద్దు చేస్తామన్నారు. ఓసీ కౌలు రైతుకు రైతు భరోసా ఇవ్వకూడదని చట్టంలో పెట్టారని వెల్లడించారు. . 2019లో జగన్ చేసిన చేసిన చట్టాన్ని రద్దు చేసి 2016లో చేసిన చట్టాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కౌలు రైతుకు బ్యాంక్ రుణాలు,ప్రభుత్వ పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఓసీ రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని ఎమ్మెల్సీ లక్ష్మణ రావు మండలిలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు మాత్రమే రైతు భరోసా అందించారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు చెప్పారు.

వచ్చే ఏడాది రైతులకు ప్రభుత్వం మంచి ఇన్స్యూరెన్స్ పథకం అమలు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది వరకు పాత విధానంలో మాత్రమే ఇన్స్యూరెన్స్ అమలు చేస్తామన్నారు. కేంద్రం సాయంతో వచ్చే ఏడాది మంచి ఇన్స్యూరెన్స్ పథకం అమలు చేసి రైతులకు మరింత మేలు చేస్తామని హామీ ఇచ్చారు.దీనివల్ల ఖరీఫ్, రబీ సమయంలో కూడా రైతులు నష్ట పోకుండా ఇన్స్యూరెన్స్ అందేలా చేస్తా మన్నారు. బెస్ట్ ఇన్స్యూరెన్స్ పథకం వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తా మన్నారు. 2016 నుంచి 2019 వరకు అందిన విధంగా ఇన్స్యూరెన్స్ ప్రయోజన ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

## శివాపురం వద్ద సొంత ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించిన నారా భువనేశ్వరి



ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన కుప్పం నియోజకవర్గంలో సొంత ఇల్లు నిర్మించుకుంటున్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని శివాపురం వద్ద ఇల్లు నిర్మిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, తమ సొంత ఇంటి నిర్మాణ పనులను చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి నేడు పర్యవేక్షించారు. పనులు సాగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ను అడిగిఈ వివరాలు తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్ కు ఆమె పలు సూచనలు చేశారు.

చంద్రబాబుకు కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం కంచుకోట. ఆయన ఇక్కడ్నించి వరుసగా ఎనిమిదిసార్లు విజయభేరి మోగించారు. అయితే, సొంత నియోజకవర్గంలో ఇల్లు లేదన్న విమర్శలు ఎదుర్కొన్నారు. విమర్శలకు అడ్డుకట్టవేయాలని భావించి ఆయన ఇంటి నిర్మాణం చేపట్టారు.

# రోడ్లు మరమ్మతులు చేపట్టాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం ఎమ్మార్ నగరం పంచాయతీ గ్రామ సమీపంలో రోడ్లు పూర్తిగా గోతులతో అద్వానంగా మరాయి. అధ్వాన రోడ్లుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం గాలికి వదిలేసింది రోడ్లు బాగోలేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు విడిచారు. రోడ్లను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అలాగే రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక వాహనం దగ్గర రోడ్ టాక్స్ ముక్కు పిండి వసీలు చేస్తున్నారు. ఆ డబ్బులు ఏం చేస్తున్నారు. ప్రజల ప్రయోజనాలు కోసమా లేదంటే మీ జేబులు నింపుకోవడం కోసమా ? అని పి .సంగం ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు గారు రోడ్లు బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడతారని కోరుతున్నాము. అలాగే పార్వతిపురం నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులైన బోనెల విజయ్ చంద్ర గారు ఎన్నికల ముందు ప్రతి మండలం గ్రామ పంచాయతీలకు తిరిగారు అలాగే ఇప్పుడు కూడా ప్రతి మండలం పంచాయతీ గ్రామంలో తిరిగి రోడ్లు బాగు చేస్తారని అభివృద్ధి చేస్తారని కోరుతూ సిపిఎంఎల్ పార్టీ కన్వీనర్ జిల్లా కార్యదర్శి పి .సంఘం కోరారు లేనియెడల ధర్నాలు ,రాస్తారోకులు, నిరసనలు చేస్తారని చెప్పారు ఈ కార్యక్రమంలో జి .దుర్గారావు ఎం. నవీన్, జి. అభి ,ఎం. రాజు, పి. కిరణ్, జే .ప్రసాద్ ,పి .వినయ, పి. గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని, రైతాంగానికి ద్రోహం చేసిన బిజెపి : సిపిఎం




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి, వెనుకబడిన ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసిందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తీవ్రంగా పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రత్యేక హెూదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. గత పది సంవత్సరాల నుండి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బిజెపి నిర్లక్ష్యం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయకపోగా స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకప్యాకేజీ క్రింద నిధులు కేటాయింపులు లేవన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి 15వేల కోట్లు వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడటమంటే ఆ 15వేల కోట్లు అప్పులుగానే భావించాల్సి వుంటుంది. బిజెపితో దోస్తీ కట్టిన టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రైతాంగానికి అవసరమైన ఎరువుల సబ్సిడీకి పెద్ద ఎత్తున కేటాయింపులు తగ్గించారు. ప్రధాన మంత్రి గరీబీ కళ్యాణ్ యోజన అమలు చేస్తామంటూనే ఆహార సబ్సిడీకి భారీగా కోత పెట్టారు.

వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీకి క్రమేణా నిధులు తగ్గిస్తున్నారు. పంటల బీమా, పిఎం కిసాన్, ఇలా అన్ని పథకాలకు ఇదే పరిస్థితి. ఎరువుల సబ్సిడీ, ఆహార సేకరణ సబ్సిడీ, ఉపాధి హామీలకు నిధులివ్వకుండా ఏ విధంగా పంటల ఉత్పాదకతపెరుగుతుందోఅర్థంకావడంలేదన్నారు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలని రైతులు ఆందోళనలు చేస్తుండగా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దేశ రైతాంగాన్ని దగా చేయడమేనన్నారు. ఆహారం, ఎరువులు, ఇంధన రంగాల్లోని సబ్సిడీలకు కేటాయింపులు చూస్తే గత బడ్జెట్‌తో పోలిస్తే 7.8 శాతం సబ్సిడీల్లో కోతపెట్టమంటే ఇది పూర్తిగా ప్రజలను మోసం చేసే బడ్జెటే.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యన్నారాయణ, అల్లు రాజు, సిపిఎం నాయకులు గండి నాయనబాబు, డి.శ్రీనివాసరావు, బి.నూకఅప్పారావు, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

## 100 మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా చేయాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి ఆకట్టుకున్నారు. గతంలో ఎంతోమంది ఎస్సీ సామాజిక వర్గం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలుగా పని చేశారు అయినా ఎస్సీ సామాజిక వర్గంలో ఎదుగుదల కనిపించలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సి ఓ ప్రణాళిక నిధులు కూడా మంజూరు కాలేదు. ఎన్డీఏ ప్రభుత్వంలో మంచి ఆలోచన చేస్తారని ఆశతో ఓ ప్రతిపాదన చేశారు. వందమంది ఎస్సీ యువతను ఎంపిక చేసి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తే వారి ద్వారా మరింతమంది డెవలప్ అయ్యేందుకు అవకాశం ఉందని సూచించారు. గతంలో ఇటువంటి ప్రయత్నం ఏదైనా జరిగిందా? మన ప్రభుత్వం హయాంలో చేసి చూపించలేమా అని చక్కని ఆలోచన అసెంబ్లీలో వివరించి ఆకట్టుకున్నారు.

# సినిమా



## జీవితంలో వచ్చే ప్రతి కష్టాన్ని ఎదుర్కోవాల్సిందే: సమంత



జీవితంలో ఎదురయ్యే ప్రతీ కష్టాన్ని ఎదుర్కోవాల్సిందేనని సమంత అన్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన భావాలను పంచుకొనే ఆమె తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తాను ఈ స్థాయికి రావడం కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నట్లు తెలిపారు.

'మన జీవితాల్లో జరిగే కొన్ని విషయాలు మార్చుకోవాలని అందరం కోరుకుంటాం. ఒక్కోసారి వీటన్నిటినీ భరించాల్సిందేనా అని ఆశ్చర్యపోతాం. అలా జరగకుండా ఉంటే బాగుండేదని అనుకుంటాం. వెనక్కి తిరిగి చూసుకుంటే వేరే మార్గం ఉండదు. గత మూడేళ్లలో ఇలా జరగకుండా ఉంటే బాగుండేదని ఎన్నో విషయాల్లో అనుకున్నాను. కానీ, జీవితంలో వచ్చే ప్రతీ కష్టాన్ని ఎదుర్కోవాల్సిందే. అలాంటివి ఎదుర్కొన్నప్పుడే జీవితాన్ని గెలిచినట్లు భావిస్తాను. గతంతో పోలిస్తే నేను ఇప్పుడు ధైర్యంగా ఉన్నాను. ఈ స్థాయికి రావడానికి అగ్నిగుండాల్లాంటి ఎన్నో సవాళ్లను దాటాను' అని చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి.

మరోవైపు కొంతకాలం విరామం తర్వాత సమంత మళ్లీ షూటింగ్స్‌లో బిజీ అవుతున్నట్లు తెలుస్తోంది. 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ఇటీవల ప్రకటించారు. అలాగే అనిల్ బర్వే దర్శకత్వంలో రానున్న ఓ వెబ్‌సిరీస్‌లో సమంత నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇందులో 'మీర్జాపూర్' ఫేమ్ అలీ ఫజల్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. థ్రిల్లర్ వెబ్ సిరీస్‌గా ఆరు ఎపిసోడ్‌లలో ఇది రానున్నట్లు తెలుస్తోంది.

### అందరినీ ఆకట్టుకునే అలనాటి రామచంద్రుడు

## ఆగస్టు 2 న విడుదల - కొత్త హీరో కృష్ణ వంశీ



అలనాటి రామచంద్రుడు సినిమా యూనిట్ గురు వారం విశాఖలో సందడి చేసింది.

కృష్ణ వంశీ, మోక్ష హీరో హీరోయిన్లుగా హైనివా క్రియేషన్స్ బ్యానర్‌పై హైమావతి , శ్రీరామ్ జడపోలు నిర్మించిన చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహించిన అలనాటి రామచంద్రుడు మూవి చిత్ర ప్రమోషన్ లో భాగంగా విశాఖ వచ్చారు. ఇందులో భాగంగా డాబా గార్డెన్స్ లో గల ఒక హోటల్లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ లో హీరో, హీరోయిన్ డైరెక్టర్ తో పాటు నటులు స్నేహ, వెంకటేష్ తదితరులు పాల్గొని మీడియాతో మాట్లాడారు.

హీరో కృష్ణ వంశీ మాట్లాడుతూ, ఈ సినిమా ఆగష్టు రెండో తేదీన విడుదల అవుతుంది అన్నారు. శశాంక్ తిరుపతి వీనుల విందుగా సంగీతం అందించారు అని ప్రశంసించారు. ఆర్ఆర్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మ్యూజిక్ బాగా వచ్చింది అన్నారు. తనకు విశాఖ తో ప్రత్యేక అనుబంధం వుంది అన్నారు. విశాఖలో స్టార్ మేకర్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకున్నాను అని పేర్కొన్నారు. ఇదే తనకు తొలి సినిమా అన్నారు. అందరికీ తొలి ప్రేమ వుంటుంది. సినిమా చూసిన పుడు తప్పకుండా గుర్తొస్తాయి అన్నారు. అమ్మాయిలు సాధారణంగా తండ్రి లాంటి భర్తనే కోరుకుంటారు. ఇందులో తాను సిద్దు పాత్ర చేశాను అని తెలిపారు.

హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ, తాను బెంగాలీ అమ్మాయిని, తెలుగు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను అన్నారు. తెలుగు ప్రేక్షకులు సినిమా ప్రేమికులు అన్నారు. తాను లక్కీ లక్ష్మణ్ సినిమాలో కూడా నటించాను. నిజాయితీ వున్న ప్రేమ కథ ఇది. తాను చిన్నపుడు కుటుంబ సభ్యులతో విశాఖలోనే వున్నాం అని గుర్తు చేశారు.

డైరెక్టర్ చిలుకూరి ఆకాష్ రెడ్డి మాట్లాడుతూ, విశాఖలో గల సింహాచలం అప్పన్న స్వామి దర్శనం చేసుకున్నాం అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సినిమా ప్రేమ కథ. అమ్మాయి, అబ్బాయి ఇష్టపడి ప్రేమించుకోవడం వంటి కథలతో ఎన్నో సినిమాలు వచ్చాయి. ఈ రాముడు సీతతో అబద్ధం ఆడితే ఎలా వుంటుంది అన్న పాయింట్ తో సినిమా నడుస్తుంది. వరంగల్, అమలా పురం, విశాఖ తదితర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చేశాం అని తెలిపారు. తాను, చిత్ర సంగీత దర్శకుడు షార్ట్ ఫిలింస్ తో కొంత కాలం జర్నీ చేశాం. హీరోయిన్ గతంలో చేసిన కొన్ని రీల్స్ నచ్చి ఈ సినిమాలో హీరోయిన్ గా ఎంపిక చేశాం అని గుర్తు చేశారు. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అన్నారు.

హాస్య నటుడు వెంకటేష్ మాట్లాడుతూ, దర్శకుడు ఆకాష్ మంచి కథ రాసి డైరెక్షన్ చేశారు అని పేర్కొన్నారు. తాను ఈ సినిమాలో శ్రీ శైలం పాత్ర చేశాను అన్నారు.

నటి స్నేహ మాట్లాడుతూ, విశాఖలో సినిమా ప్రమోషన్ సంతోషకరం గా వుంది అన్నారు. విశాఖ లోనే తమ స్నేహితుల సర్కిల్ అంతా వుందని తెలిపారు. ప్రేక్షకులు ఈ సినిమా థియేటర్లు లో చూసి తమను ఆదరించాలి అని కోరారు.

## ఆ సమయంలో సూర్య వైపు చూడటానికి భయపడ్డా: రాధికా మదన్



దక్షిణాదిలో ఘన విజయాన్ని అందుకున్న 'సూరారై పోట్రు'ను బాలీవుడ్‌లో 'సర్ఫిరా'గా రీమేక్ చేసిన విషయం తెలిసిందే. అక్షయ్ కుమార్ , రాధికా మదన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై హిందీ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఈనేపథ్యంలో కథానాయిక రాధికా మదన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తమ చిత్ర నిర్మాత, నటుడు సూర్య గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఆయన చాలా సైలెంట్‌గా ఉంటారని.. మిత భాషి అని చెప్పారు.

"మా నిర్మాత సూర్య చాలా మంచి వ్యక్తి. ఆయన చాలా తక్కువగా మాట్లాడతారు. 'సర్ఫిరా' స్పెషల్ స్క్రీనింగ్‌కు సూర్య హాజరయ్యారు. సినిమా ప్లే అవుతున్నంతసేపు ఆయన వైపు చూడలేదు. ఎందుకంటే, ఆయనకు నా యాక్టింగ్ నచ్చుతుందో, లేదో, ఎలా రియాక్ట్ అవుతారో అని భయపడుతూ కూర్చొన్నా. నా ప్రదర్శన నచ్చితే తప్పకుండా ఏదో ఒకటి చెబుతారు. నచ్చకపోతే సైలెంట్‌గా ఉంటారని నన్ను నేను సమాధానపరచుకున్నా. అలాంటి సమయంలో ఆయన నా వద్దకు వచ్చి.. 'బాగా యాక్ట్ చేశావు. సినిమా బాగుంది' అని చెప్పారు. ఆ మాటలు నాకెంతో ఆనందాన్ని ఇచ్చాయి. ఇదే విషయాన్ని మా దర్శకురాలు సుధా కొంగరకు చెప్పగా.. సూర్య ఆ మాట అన్నారంటే సినిమా తప్పకుండా విజయం అందుకుంటుంది అని బదులిచ్చారు" అని తెలిపారు.

ఎయిర్ డెక్కన్ సంస్థను స్థాపించి, అందరికీ తక్కువ ధరకే విమాన ప్రయాణ సౌకర్యం అందించిన కెప్టెన్ గోపీనాథ్ జీవితాధారంగా రూపొందిన చిత్రమే 'సూరారై పోట్రు' (ఆకాశం నీ హద్దురా). కొవిడ్ కారణంగా ఈ సినిమా నేరుగా ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలైంది. తమిళ, తెలుగు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. సుధా కొంగర దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఎందరిలోనో స్ఫూర్తినింపింది. మాతృకను తెరకెక్కించిన సుధా కొంగరనే 'సర్ఫిరా'నూ రూపొందించారు. సూర్య నిర్మాతగా వ్యవహరించారు. కథ, కథనం బాగున్నప్పటికీ.. ఎమోషన్స్ సరిగ్గా పండలేదని పలువురు సినీ ప్రియులు అభిప్రాయపడ్డారు.

## బిగ్ కమర్షియల్ మూవీస్ చేయకపోవడానికి కారణమదే: జాన్వీకపూర్



బిగ్ కమర్షియల్ చిత్రాల్లో నటించకపోవడంపై ఇటీవల ఓ చిట్‌చాట్‌లో నటి జాన్వీకపూర్ స్పందించారు. అలాంటి చిత్రాల్లో నటిస్తే సులభంగా ఫేమ్ సొంతం చేసుకోవచ్చని ఆమె అన్నారు. కాకపోతే అది తనకు ఇష్టం లేదని చెప్పారు.

"కావాలనుకుంటే నటిగా సక్సెస్ అయ్యేందుకు సులభమైన మార్గాన్ని ఎంచుకోవచ్చు. ఇప్పటివరకూ నేను చేసిన ప్రాజెక్టులకు బదులు గ్లామరస్ పాత్రలతో ఉన్న బిగ్ కమర్షియల్ సినిమాలు చేసి ఉండొచ్చు. అలాంటి చిత్రాల్లో నటిస్తే త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్తాం. పాపులారిటీ, బాక్సాఫీస్ నంబర్లు గ్యారంటీగా వస్తాయి. కాకపోతే, సినిమా రంగంలో నటిగా రాణించడమనేది చాలా క్లిష్టమైన విషయం. విభిన్నమైన కథలను ప్రేక్షకులకు అందజేయడమే లక్ష్యంగా చిత్రాలు ఎంచుకుంటున్నా. దానివల్ల విజయాల కంటే కూడా పరాజయాలు వస్తుంటాయి. కానీ, ఒక నటిగా ఇలాంటి చిత్రాలు నా ఎదుగుదలకు మరింత ఉపయోగపడతాయని నమ్ముతున్నా. నన్ను సవాలు చేసే పాత్రలో యాక్ట్ చేయడం ఆనందంగా ఉంది" అని చెప్పారు.

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ట్రోల్స్ గురించీ ఆమె మాట్లాడారు. "సామాజిక మాధ్యమాల్లో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. కాబట్టి ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడినవాళ్లే, అదే విషయంపై రేపు తిడతారు" అని తెలిపారు.

జాన్వీకపూర్ నటించిన రీసెంట్ మూవీ ఉలఝ్'. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జంగ్లీ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. ఇలాంటి స్పై థ్రిల్లర్ మూవీలో భాగం కావడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. మరోవైపు ఆమె 'దేవర'తో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది. ఎన్టీఆర్ డ్యాన్స్ అంటే తనకెంతో ఇష్టమని.. ఆయన కలిసి డ్యాన్స్ చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని చెప్పారు.

## 'రాజాసాబ్'పై తమన్ ఆసక్తికర కామెంట్స్..



ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'రాజాసాబ్' మ్యూజిక్‌పై సంగీత దర్శకుడు తమన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అది కమర్షియల్ ఆల్బమ్ అని తెలిపారు. నగరంలో మంగళవారం నిర్వహించిన ఓ మ్యూజికల్ ఈవెంట్ కర్టెన్ రైజర్ ఈవెంట్‌కు ఆ చిత్ర దర్శకుడు మారుతితో కలిసి తమన్ హాజరయ్యారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

"కల్కి'తో ప్రభాస్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. దీంతో, మాపై కాస్త ఒత్తిడి నెలకొంది. అయితే, ఇది కమర్షియల్ ఆల్బమ్ కావడం ఉపశమనం. ఇందులో డ్యాన్స్‌కు ప్రాధాన్యమున్న పాటలున్నాయి. ఆ విషయంలో మునుపటి ప్రభాస్ సర్‌ని చూస్తుండడం నాకు ఆనందంగా ఉంది" అని చెప్పారు.

'గేమ్ ఛేంజర్' అప్‌డేట్ గురించి అడగ్గా.. "ఈ సినిమా క్రిస్మస్‌కు వస్తుందంటూ నిర్మాత దిల్ రాజు అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఆగస్టు ఎండింగ్ నుంచి అప్‌డేట్స్ ఇవ్వాలనుకుంటున్నాం. ఈ చిత్రంలో ఏడు పాటలున్నాయి. ఇప్పటికే 'జరగండి జరగండి' సాంగ్ విడుదలైంది. అది నెట్టింట లీకైన సంగతి తెలిసిందే. ఈసారి లీక్ అవకముందే రెండో పాటను రిలీజ్ చేసేస్తాం" అని ఫన్నీగా సమాధానమిచ్చారు. రామ్ చరణ్ హీరోగా శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది.

## ఆ సినిమా సమయంలో విజయ్‌ని చూసి భయపడ్డా.. రష్మిక



కొంతమంది హీరో, హీరోయిన్ల ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీని ప్రేక్షకులు ఎంతగానో ఇష్టపడుతుంటారు. అలాంటి వారి జాబితాలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో నటించిన సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక ముందుటారు. 2018లో మంచి విజయాన్ని అందుకున్న సినిమా 'గీత గోవిందం'. పరశురామ్ తెరకెక్కించిన ఈ సినిమా వసూళ్ల వర్షం కురిపించింది.

అటు విజయ్‌ని, ఇటు రష్మికను ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గర చేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ.. "కొత్త వ్యక్తులతో మాట్లాడటం అంటే కాస్త బెరుకు. అందుకే 'గీత గోవిందం' సినిమా షూటింగ్ సమయంలో తొలిసారి విజయ్‌తో కలిసి నటించేందుకు భయపడ్డా. కానీ, విజయ్ చాలా కూల్. అతడు సెట్లో ఉంటే.. వాతావరణం పాజిటివ్‌గా ఉంటుంది. అతనితో కలిసి నటించడం సులువుగా అనిపిస్తుంది. అందుకే ఆ సినిమా షూటింగ్ చాలా సాఫీగా సాగిపోయింది" అంటూ అప్పటి విషయాలను గుర్తుచేసుకున్నారు.

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ 'పుష్ప2: ది రూల్'. రష్మిక కథానాయిక. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురావాలి. అయితే, డిసెంబర్ 6వ తేదీ నాటికి వాయిదా పడింది.

# ఎఫ్‌సిఎ టార్గెట్ మిషన్ 10 లక్షలు

## సేవలతోనే సంతృప్తి - ఎఫ్ సి ఎ చైర్మన్ దాసరి రాంబాబు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సేవలతో నే సంతృప్తి లభిస్తుందని ఫెసిలిటీ క్రియేటర్స్ అసోసియేషన్ (ఎఫ్‌సిఎ) కంపెనీల గ్రూప్ చైర్మన్ దాసరి రాంబాబు పేర్కొన్నారు. గాజువాక దరి షీలానగర్ వద్ద గల సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆయన పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ సంస్థను 2020 సంవత్సరంలో స్థాపించాం అని గుర్తు చేశారు. ఈ సంస్థ ద్వారా సభ్యులకు పలు సేవలు అందిస్తున్నాము అన్నారు. తమ సంస్థ ను సొసైటీ కింద రిజిస్ట్రేషన్ చేయించాం అన్నారు. తమ సంస్థలో ప్రస్తుతం 1.20 లక్షల మంది సభ్యులు ఉన్నారు అని తెలిపారు. సంస్థ సభ్యత్వం మీషన్ - 10 లక్షలు టార్గెట్ గా పెట్టుకున్నాం. సభ్యుల సహకారంతో ఈ లక్ష్యం చేరుకుంటాం అని ఆశాభావం వ్యక్తంచేశారు. సభ్యుల జీవిత బీమా ప్రీమియం సంస్థ చెల్లిస్తుంది అన్నారు. సభ్యులు నెలకు రూ.300 సభ్యత్వ రుసుం చెల్లించాలి అని తెలిపారు. సభ్యులకు రుణాలు కూడా ఇస్తున్నాం. సభ్యులు ఎవరైనా చనిపో తే తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందజేస్తున్నాం. తమ సంస్థ కార్యకలాపాలు ఆంధ్ర, ఒడిస్సా కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో వున్నాయి అని ఒక ప్రశ్నకు సమాధానం గా చెప్పారు. మీడియా మిత్రులకు కూడా సహాయం చేసే అవకాశం రావడం సంతోషకరం అన్నారు.

సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు ఊరుకుటి శ్రీనివాస రావు మాట్లాడుతూ, సంస్థ ద్వారా పలు రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము అని తెలిపారు. తమ సంస్థ ఈ ఏడాది ఆరో సంవత్సరం లోకి అడుగు పెడుతోంది. సభ్యులకు ప్రోత్సాహకాల్లో భాగంగా రజ స్వల అయిన యువతులకు రూ.13 వేలు, వివాహం సమయంలో వధువుకు రూ.లక్ష, వరునికి రూ. 50 వేలు వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నం. సభ్యులకు బీమా పథకాలు వున్నాయి అని తెలిపారు.

ముందడుగు న్యూస్ చానల్ ఎం.డి. సూరిసెట్టి మల్లేష్ మాట్లాడుతూ, దాసరి రాంబాబు కొంత కాలం క్రితం మీడియాకి పరిచయం అయ్యారు అని గుర్తు చేశారు. ఆయన పుట్టిన రోజు వేడుకలో భాగంగా కొందరు జర్నలిస్టులకు సన్మానం చేసి, ఉచిత జీవిత బీమా బాండ్లు అందజేయడం జరుగుతుంది అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయడానికి ముందుకు వచ్చిన రాంబాబుకి ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం కొందరు జర్నలిస్టులను సత్కరించి, రూ.5 లక్షల జీవిత బీమా బాండ్లు అందజేశారు.

తరువాత దాసరి రాంబాబు కేకు కట్ చేసారు.

ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎన్. సుధా రాణి, లీగల్ అడ్వైజర్ ఆర్.సామ్యూల్ జాన్ ధర్మ రాజు, మేనేజర్ పీ.కుసుమ, ప్రతినిధులు రామ కృష్ణ, బీ. వీరభద్ర రావు, పద్మా వతి, వై.విజయ కుమార్, ఎం విజయ శంకర్, ఏళ్ల విజయ లక్ష్మి, పీ శ్రీనివాస రావు, ఎస్ రామ కృష్ణ, వీ.సూర్య కుమారీ, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# బాలల థియేటర్‌లో సినిమాలు వేయండి

## వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వినతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ లో గల వివెం ఆర్ డి ఎ బాలల థియేటర్లో బాలల సినిమాలు వేయాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశ రావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం వీ ఎం ఆర్ డి ఎ కార్యాలయం లో కమిషనర్ విశ్వనాథన్ కి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, 1994 లో ఇక్కడ బాలల థియేటర్ తయార యి, 2017 లో పూర్తి హంగులతో బాలల కార్యక్రమాలు బాల ల చిత్ర ప్రధర్శన ల తో నిత్యం బాలల తో కళకళ లాడుతుండేది అన్నారు. కాని గత కొన్ని ఎ ళ్ల గా బాల ల కార్యక్రమాలు ఆపి కేవలం ప్రైవేట్, ప్రభత్వ కార్యక్రమాల నిర్వహణ కు పరిమితం అయింది అని విచారం వ్యక్తం చేశారు. కాబట్టి, తమరు చొరవ చూపి పూర్తి స్థాయి లో బాలల కార్యక్రమాల నిర్వహణ, బాలలచిత్రాల ప్రదర్శనలు నిర్వహించే ల చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అంద చేశారు. ఇందుకు స్పందించిన కమిషనర్ విశ్వ నాథన్ మాట్లాడుతూ, తగిన చర్యలు తీసుకుంటానని, సహకారం అందిస్తానని అన్నారు. కమి షనర్ ను కలసిన వారి లో నరవ ప్రకాశ రావు తో పాటు సొసైటీ సహాయ కార్యదర్శి డాక్టర్ బాబ్జి కూడా ఉన్నారు.

# అసత్యప్రచారాలు మానుకోవాలి : ఎంఎల్ఏ గంటా



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** కూటమి ప్రభుత్వ పాలన పై మాజీ ముఖ్యమంత్రి జగన్ అసత్య ప్రచారాలను మానుకోవాలని భీమిలి శాశన సభ్యులు గంటా శ్రీనివాసరావు హితవు పలికారు. స్థానికం గా గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో ఆయన పేర్కొంటూ సమాజమే దేవాలయం, ప్రజలే దేముళ్ళు అనే నినాదం తో ప్రజలకోసం అలనాడు దివంగత ఎన్ టి రామారావు తెలుగుదేశం పార్టీ ని స్థాపించారాని ఆయన పేర్కొన్నారు. అదే నినాదం నేడు చంద్రబాబు నాయుడు పార్టీ ని ముందుకు నడిపిస్తున్నారని, అటు వంటి చంద్రబాబు నాయుడు నేడు కూటమి ముఖ్యమంత్రి అయ్యారని ఆయన పేర్కొన్నారు. గతం లో ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు చంద్ర బాబు నాయుడు హుదూద్ సమయం లో విశాఖ కు వచ్చి ఆయన విశాఖ కు చేసిన సేవలు ఎప్పటికి ప్రజలు మరువలేరని, రాజధాని లేని విభజిత రాష్ట్రం ను సమర్ధవంతం గా ముందుకు నడిపిన గొప్ప వ్యక్తి చంద్రబాబు నాయుడు అని ఆయన పేర్కొన్నారు. అటువంటి ముఖ్యమంత్రి పైన, కూటమి ప్రభుత్వం పైన మాజీ ముఖ్యమంత్రి అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాలంటీర్లు లేకుండా పెన్షన్ లు ఈయలేరని అన్న జగన్ కు 1 వ తేదీన వాలంటీర్లు లేకుండా పెన్షన్లు ఇంటివద్ద నే (3 నెలల బకాయిలతో) 4 వేలు రూపాయిలు పంపిణి చేసి తాను ఏమిటో చేసి చూపించారని, అలాగే వైసీపీ ప్రభుత్వం లో జాబ్ క్యాలెండర్ ప్రకటంచని జగన్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డి ఎస్ సి ప్రకటించి ఇచ్చిన మాట నిలబెట్టి కొన్నారని, ప్రయివేట్ ఆస్తులను దోచుకోవడానికి జగన్ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తీసుకువస్తే, అధికారం లోకి వచ్చిన వెంటనే దాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులను పరిరక్షణ చేసిన చంద్రబాబు నాయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ అసత్య ప్రచారాలను మానుకోవాలని లేకుంటే ప్రజలు మరలా బుద్ధి చెపుతారని ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# నేడు తగరపువలస ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి జోన్ చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్(33/11 కెవి) పరిధి లో గల పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా కు అనంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్( ఆపరేషన్ జోన్-3 విశాఖ) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. స్థానికం గా గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో ఆయన పేర్కొంటూ చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ లో నిర్వహణ పనులు, విద్యుత్ లైన్ లకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, పునరుద్ధరణ పనుల దృష్ట్యా చిట్టివలస, కొత్తపేట, గణేష్ థియేటర్ రోడ్,సంతపేట,జ్యూట్ మిల్ కార్మికవాడ, కొండపేట, తగరపువలస ప్రధాన రహదారి, బంగ్లామెట్ట, రామన్న పేట,ఆదర్శనగర్, సప్తగిరి లేఅవుట్,చిల్లపేట, జీరుపేట, ఊళ్ళపేట,సంగివలస, తాటితూరు, టి నగరపాలెం, మజ్జివలస, సింగనబంద, లక్ష్మీపురం, విజయ రాంపురం, నారాయణరాజుపేట తదితర ప్రాంతాలలో శు క్రవారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని, కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# జగన్ కి ప్రజా సమస్యలు పట్టవా? : టీడిపి నేత బైరెడ్డి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలపై ఏమాత్రం అభిమానం లేదని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు, ఆ పార్టీ జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతనరెడ్డి మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించే ఉద్దేశ్యం జగన్ అండ్ కో కి అనుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఓట్లతో గెలిచిన వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభకు ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే శాసనసభ సమావేశాల్లో పాల్గొని ప్రజా సమస్య లను ప్రస్తావించాలని వైసిపి ఎమ్మెల్యే లకు సూచించారు. గౌరవప్రదమైన సభలో పాల్గొని ప్రభుత్వానికి రాష్ట్రాభి వృద్ధి, ప్రజా సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై వైసిపి ఎమ్మెల్యేలు సూచ నలు ఇస్తే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రజలు తమకు తక్కువ సీట్లు ఇచ్చారనే అక్కస్సుతో జగన్ శాసనసభ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని భావించాల్సి వస్తుందని తెలిపారు. శాసనసభ సమావేశాలకు వైసీపీ ఎమ్మె ల్యేలు హాజరు కాకపోవడం ప్రజాస్వా మ్యానికి తూట్లు పొడిచినట్లేనని పోతన రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంకా జగన్ కి అధికారం పై వ్యామోహం పోలేదని అన్నారు. శాసనసభ సమావేశాలకు హాజరు కాకుండా ప్రతిపక్ష హెూదా కావాలంటూ జగన్ హైకోర్టును ఆశ్రయించడాన్ని ఎద్దేవా చేశారు. దీన్నిబట్టి జగన్ కు రాష్ట్రం, ప్రజల కంటే అధికార దర్పమే కావాలని మరోసారి తేటతెల్లమైందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం, అరాచకాలే తప్పా అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని, నియంత పాలన సాగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగానికి తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన జగన్ ఢిల్లీలో ఆందోళన నిర్వహిం చడాన్ని తప్పుపట్టారు. ఎన్డీఏ కూటమి సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజా సంక్షే మానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పోతన రెడ్డి స్పష్టం చేశారు.

# కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి మొండి చేయి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్రబడ్జెట్ రాష్ట్రానికి మొండి చేయి చూపినందున ముఠా కార్మికులు ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో కొత్త రోడ్ల లోనూ పూర్ణ మార్కెట్ లోనూ నిరసన తెలిపారు.

కార్యక్రమంలో ముఠా కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు వై. రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపక్ష నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడలేకపోవడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమే, విభజన హామీలు కోసం పోరాడాలని అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకించారు. డి వై ఎఫ్ ఐ నాయకుడు కే.సంతోష్ కుమార్ మాట్లాడుతూ, బడ్జెట్ కార్మికులకు , యువతకు రైతులకు నష్టం వాటిల్లిందని తెలిపారు. సి టు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శ చంద్ర మౌళి మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి 10 సంాలు ఐన కేంద్రం ఇంకా రాజధానిని నిర్మించలేదని ఈ బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వానికి 15 వేల కోట్ల రూపాయలు అప్పు ఇప్పిస్తామని చెప్పడం కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకున్నారు అని పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్ లో కేటాయింపు లేదని కేంద్ర ప్రభుత్వం ఇలా అన్యాయం చేస్తే వేరే రాష్ట్రానికి లాభం చేకూర్చేల చేయడం అన్యాయమని కేంద్రంలో చక్రం తిప్పుతున్నా చంద్ర బాబు నాయుడు మాట్లాడ లేకపోవడం అన్యాయమని అన్నారు. ముఠా కలసిలు చేసిన ఉద్యమాల వల్ల రాష్ట్రంలో వై సి పి ప్రభుత్వం పోవడం కేంద్రంలో ఎన్ డి ఎ ప్రభుత్వంకు మెజారిటీ తగ్గడం జరిగింది అని తెలిపారు. ఈ ఉద్యమాలు వల్ల కేంద్రం బుద్ధి తెచ్చుకోవలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముఠా కలాశీలు పాల్గొన్నారు.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.